# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :270 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 08-01-2026 | పేజీలు:4 వెల: 2.00


## తీవ్రం అవుతున్న పిచ్చికుక్కల బెడద..భైంసాలో ఒక్కరోజే 50 మందిపై దాడి

నిర్మల్,కుక్కల స్వైర విహారంతో జనం బెంబేలెత్తి పోతున్నారు. అవి దాడి చేసినప్పుడు హడావిడి చేస్తున్న అధికారులు తరవాత మరిచి పోతున్నారు. గ్రామం నుంచి పట్టణం వరకు కుక్కల బెడద తీవ్రం అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తాజా నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో ఓ పిచ్చి కుక్క బీభత్సం సృష్టించింది. సోమవారం ఒక్కరోజే 50మందిపై దాడిచేసి గాయపరిచింది. ఈ పిచ్చికుక్క దాడిలో నలుగురు చిన్నారులు, 20 మంది మహిళలు, 26 మంది పురుషులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భైంసా ప్రభుత్వ ఆస్పత్రిలో కుక్క కాటు బాధితులు భారీగా చేరారు. ఆస్పత్రి వైద్యులు తక్షణం మెడికల్ సహాయం అందిస్తున్నారు. పిచ్చి కుక్కలను పట్టుకోవడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారుల నుంచి సరైన పరిష్కారం రాలేదని ఆవేదన చెందుతున్నారు. శునకాల దాడులతో తీవ్ర భయాందోళన చెందుతున్నామని వాపోయారు.

## నిజామాబాద్ ఎమ్మెల్సీగా అజారుద్దీన్ పోటీ..?



హైదరాబాద్,ఎప్పుడైతే కేసీఆర్ కూతురు కవితను బీఆర్ఎస్ పార్టీ సస్పెండ్ చేసిందో ఆ సమయంలోనే ఆమె పార్టీ నుండి సస్పెండ్ చేసినప్పుడు పార్టీ ద్వారా వచ్చిన ఎమ్మెల్సీ పదవి మాత్రం నాందుకు అని రాజీనామా చేసి రాజీనామా లెటర్ ని మండలి చైర్మన్ కి పంపింది.కానీ మండలి చైర్మన్ ఆమె రాజీనామా ఆమోదించకపోవడంతో రీసెంట్గా జరిగిన శాసన మండలి సమావేశంలో పాల్గొని తన రాజీనామాను ఆమోదించాల్సిందిగా మండలి చైర్మన్ ముందు విన్నవించుకుంది.ఇక మండలి చైర్మన్ కవిత రాజీనామాను ఆమోదించడంతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది.నిజామాబాద్ లో ప్రస్తుతం ఎమ్మెల్సీ పదవికి కవితరాజీనామా చేయడంతో అక్కడ ఉప ఎన్నికల పెట్టాలని ఎలక్షన్ కమీషన్ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.ఈ నేపథ్యంలోనే నిజామాబాద్ ఎమ్మెల్సీ గా కాంగ్రెస్పార్టీ నుండి మంత్రి అజారుద్దీన్ ని బరిలోకి దింపాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ మధ్యనే అజారుద్దీన్ కి గవర్నర్ కోటాలో మైనార్టీ సంక్షమ శాఖ మంత్రిగా కాంగ్రెస్ అధిష్టానం బాధ్యతలు అప్పగించిన సంగతి మనకు తెలిసిందే. ఇప్పటికే అజారుద్దిన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం కూడా చేశారు. అయితే మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఆ పదవిలో కొనసాగుతున్న వ్యక్తి కచ్చితంగా ప్రమాణ స్వీకారం చేసిన 6 నెలల సమయంలోగా సభకి సభ్యుడిగా ఎంపిక కావాలి. లేకపోతే గవర్నర్ నుండి ప్రత్యేక ఆమోదం అయినా పొంది ఉండాలి.అలా ఆరు నెలల్లోగా సభ్యుడిగా ఎన్నిక కావడం లేక గవర్నర్ నుండి ప్రత్యేక ఆమోదం ఈ రెండు మార్గాలు తప్ప మరో మార్గం లేదు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ అధిష్టానం నిజామాబాద్ ఎమ్మెల్సీ ఖాళీ అవ్వడంతో అక్కడి నుండి అజారుద్దీన్ ని ఎమ్మెల్సీగా పోటీ చేయించాలని చూస్తుందట. నిజామాబాద్ స్థానిక సంస్థల కోట ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అవ్వడంతో అజారుద్దీన్ కి కలిసి వచ్చిందని కొంతమంది రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.మరి నిజామాబాద్ ఎమ్మెల్సీగా అజారుద్దీన్ పోటీ చేస్తారా అనేది చూడాలి.

## తెలంగాణ టూరిజాన్ని ప్రమోట్ చేసేలా సంక్రాంతి కార్యక్రమాలు



హైదరాబాద్: ఈ సంక్రాంతి పండుగను సంప్రదాయం, సంస్కృతి పరిరక్షణకు అనుగుణంగా ఘనంగా జరుపుతున్నామని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర టూరిజాన్ని ప్రమోట్ చేయడానికి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.జనవరి 13 నుంచి 17 వరకు ఃకైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ః పరేడ్ గ్రౌండ్లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఫెస్టివల్లో 19 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, అదేవిధంగా, మన దేశంలోని 15 రాష్ట్రాల కైట్ ఫ్లయర్స్ పాల్గొంటున్నారని తెలిపారు.ఈ ఉత్సవంలో వివిధ రాష్ట్రాలకు చెందిన స్వీట్ స్టాల్లు కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. జనవరి 16 నుంచి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ షో కోసం ఏవియేషన్ అనుమతి ఇప్పటికే తీసుకున్నామన్నారు. ఈ బెలూన్ సుమారు 2,500 అడుగుల ఎత్తుకు ఎగురుతుందని, బుకింగ్ కోసం ఆన్లైన్ సౌకర్యం కూడా ఏర్పాటు చేశామని తెలిపారు.పగలు గచ్చిబౌలి స్టేడియంలో గోల్ఫ్ కోర్స్, నైట్ పరేడ్ గ్రౌండ్లో డ్రోన్ షోలు కూడా ఉంటాయన్నారు. చెరువుల పరిరక్షణ లక్ష్యంగా నగరంలోని అన్ని చెరువుల వద్ద కైట్ ఫెస్టివల్ కార్యక్రమం జరుగుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

## రాజశేఖర్ అంతిమ సంస్కారాలపై అనుమానాలు..



బళ్లారి(బెంగళూరు): బ్యానర్ వివాదంలో నెలకొన్న హింసాత్మకమైన ఘటనలపై ఐదు రోజులుగా నగరంలో ఇరు పార్టీ నాయకులు మీడియా సమావేశంలో ఒకరై ఒకరు ఆరోపణ అస్త్రాలు సందిస్తున్నారు. జరిగిన ఘటన పరిణామాలను ఎవరికి వారు... వారికి అనుకూలంగా మల్చుకుంటూ మీడియాల ద్వారా ప్రజల్లో ఉత్కాంఠాన్ని రేపుతుండడంతోపాటు రాజకీయ ద్వేషాలు రగులుకోవడంతో ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మాజీ మంత్రులు బి. శ్రీరాములు, గాలి జనార్దన్ రెడ్డి మీడియా సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులపై మరో ఆరోపణలకు దిగారు.కాల్పుల ఘటనలో మృతి చెందిన రాజశేఖర్ అంత్యసంస్కారాలపై అనుమానాలు ఉన్నాయన్లి మాజీ మంత్రి శ్రీరాములు అన్నారు. సాధారణంగా హిందూ సంప్రదాయల్లో కొంతమంది మాత్రమే మృతదేహాలను కాలుస్తారని, మిగిలిన వారంతా పూడ్చిపెట్టడం సహజమని, అయితే కాల్పుల్లో మృతిచెందిన రాజశేఖర్ మృతదేహాన్ని పూడ్చిపెట్టకుండా కాల్చడం వెనుక పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని ఆరోపించారు. రాజశేఖర్ తండ్రి చనిపోయినపుడు పూడ్చి పెట్టారని, కొడుకు చనిపోతే కాల్చేవిధానం పాటించడం వెనక అనుమానం వ్యక్తం చేయాల్సి వస్తోందన్నారు.సాక్ష్యదారాలు నాశనం చేసే ఉద్దేశంతోనే మృతుడి కుటుంబసభ్యులను బెదిరించి మృతదేహాలను కాల్చినట్లు ఆయన ఆరోపించారు. మృతుడి శరీరంలో ఐదు బుల్లెట్లు వెళ్లినట్లు.. విషయాలు బయటకు పొక్కకుండా ఉండేందుకు కాంగ్రెస్ నాయకులు జాగ్రత్త పడినట్లు తెలుస్తోందన్నారు. రెడ్డి సమాజం సాంప్రదాయం ప్రకారం కుటుంబంలో ఎవరైనా చనిపోతే కాల్చరని, పాతిపెట్టడం వారి సాంప్రదాయమన్నారు. ఘటన తీవ్రతరం అయితే మళ్ళీ పోస్టుమార్టం ఎక్కడ చేస్తారనోనని...కాంగ్రెస్ నాయకులు భయపడి మృతదేహాన్ని కాల్చివేశారని... దీనిపై కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## నిషేధం ఉన్నా హైదరాబాద్లో ఆగని చైనా మాంజా అమ్మకాలు

హైదరాబాద్, రాష్ట్రంలో నిషేధం ఉన్నప్పటికీ, ప్రమాదకరమైన చైనా మాంజా అమ్మకాలు హైదరాబాద్తో పాటు తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోనూ నిర్బంధం లేకుండా కొనసాగుతున్నాయని Animal Warriors Conservation Society ఆరోపించింది. పతంగి పండుగ సీజన్ను దృష్టిలో పెట్టుకుని పోలీసులు, అటవీ శాఖ తదితర విభాగాలు చర్చలు జరుపుతున్న సమయంలోనే ఈ నిషేధిత మాంజా మార్కెట్లో అందుబాటులో ఉండటం ఆందోళన కలిగిస్తోందని సంస్థ తెలిపింది.యానిమల్ వారియర్స్ కన్సర్వేషన్ సొసైటీ సంస్థ వ్యవస్థాపకుడు ప్రదీప్ నాయర్ మాటల ప్రకారం, హైదరాబాద్లోని ధూల్పేట్ ప్రాంతంలోని బాలారాం గల్లీలో ఒక పతంగుల విక్రేత బహిరంగంగానే చైనా మాంజాను విక్రయిస్తున్నాడు. కస్టమర్ల ముందు వివిధ వస్తువులను చైనా మాంజాతో కోసి చూపిస్తూ, ఈ మాంజా ఎంత పదునైనదో ప్రదర్శిస్తున్నాడని ఆయన ఆరోపించారు. ఈ డెమో వీడియోలను సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తుండగా, ఒక వీడియోకు ఇన్స్టాగ్రామ్లోనే సుమారు 42 లక్షల వ్యూస్ వచ్చాయని తెలిపారు.

సోషల్ మీడియా రీల్స్ ద్వారా ప్రచారరొ ఆధారాలు ఉన్నా చర్యలేవి?

'స్కై వారియర్జ్ పేరుతో విక్రయిస్తున్న ఈ మాంజా "దేన్నైనా కోసేస్తుంది" అంటూ ప్రచారం చేస్తున్నారని నాయర్ అన్నారు. ఇది ఒక్క దుకాణానికి పరిమితం కాదని, ధూల్పేట్ ప్రాంతంలో అనేక షాపులు ఇదే విధంగా చైనా మాంజాను అమ్ముతున్నాయని తెలిపారు. ఈ వీడియోలే నిషేధిత వస్తువు అమ్మకానికి స్పష్టమైన ఆధారాలని, వాటి ఆధారంగా అరెస్టులు చేయవచ్చని ఆయన



అభిప్రాయపడ్డారు.అంతేకాదు, ఆన్లైన్ బుకింగ్స్ తీసుకుని ఇతర రాష్ట్రాలకు కూడా ఈ మాంజాను పంపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారం అధికారుల దృష్టికి రాకుండా సాగుతుండటం మరింత ప్రమాదకరమని సంస్థ పేర్కొంది.

పక్షుల రక్షణకు కఠిన చర్యలు అవసరం

చైనా మాంజా వల్ల పక్షులు, ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా గాయపడే ప్రమాదం ఉందని గుర్తుచేస్తూ, ఈ అక్రమ వ్యాపారంపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని Animal Warriors Conservation Society డిమాండ్ చేసింది. తయారీదారులు, హెూల్సేల్ వ్యాపారులు, రిటైలర్లు మాత్రమే కాకుండా, ఈ మాంజా విక్రయానికి వేదికలు కల్పిస్తున్న సోషల్ మీడియా, ఈ-కామర్స్ ప్లాట్ఫామ్లపై కూడా కఠిన నిబంధనలు అమలు చేయాలని కోరింది.

## ఎక్కడో కూర్చొని... నిర్లక్ష్యంగా సలహాలు ఇస్తుంటారు: జైశంకర్ ఘాటు వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,పాకిస్థాన్ ఉగ్ర దాడులకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో పశ్చిమ దేశాలు కపటత్వం ప్రదర్శించడంపై విదేశాంగ మంత్రి జై శంకర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు . తమకు వేల మైళ్ల దూరంలో ఉన్న ఆ దేశాలు ఉద్రిక్తతల సమయంలో ఆందోళన చెందినట్లు చెప్పాయని.. కానీ అవేవీ తమ సొంత ప్రాంతంలో జరుగుతున్న వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ల్బంబర్గ్లోని భారత కమ్యూనిటీ సభ్యులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సాయం చేయాలనుకునే వారితో కలిసి పని చేసేందుకు భారత్ సిద్ధంగా ఉంటుందని జైశంకర్ పేర్కొన్నారు. అదే.. పాకిస్థాన్లా ప్రవర్తిస్తే మాత్రం వాటికి అలాగే సమాధానం చెబుతామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో జరిగే పరిణామాలు దేనిని ఏమేరకు ప్రభావితం చేస్తాయో చెప్పడం కష్టమన్నారు. ఆలోచన లేకుండా ఎక్కడో దూరంగా కూర్చొన్నవారు.. రకరకాల ప్రకటనలు చేస్తున్నారని, అవి కొన్నిసార్లు స్వార్థంగా, నిర్లక్ష్యంగా ఉంటున్నాయన్నారు. ప్రస్తుతం చాలా దేశాలు తమ స్వార్థం కోసం మాత్రమే పని చేస్తున్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎలా వ్యవహరించాలనే దానిపై పలు దేశాలు భారత్కు సలహాలు ఇచ్చాయన్నారు. కానీ అవేవీ పట్టించుకోకుండా దేశ భద్రత కోసం భారత్ ముందుకుసాగిందన్నారు.

## ఎనిమిదో వింత: కమలంతో కాంగ్రెస్ దోస్తీ!




ముంబై: మహారాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. దేశంలో ఏ ఒక్కరూ నమ్మని విధంగా భారతీయ జనతా పార్టీ(జేబీజేపీ)- కాంగ్రెస్ జతకట్టాయి.అంబర్నాథ్ మున్సిపల్ కౌన్సిల్ పీఠాన్ని దక్కించుకునేందుకు బద్ధశత్రువులైన ఈ ఇరు పార్టీలు ఒక గూటికి చేరాయి. ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు గట్టి షాక్ ఇస్తూ, బీజేపీ- కాంగ్రెస్ పార్టీలు ఇలా చేతులు కలపడం అందరినీ విస్తుపోయేలా చేస్తోంది.మహారాష్ట్ర ఎంపీ శ్రీకాంత్ షిండే నియోజకవర్గ పరిధిలోకి వచ్చే అంబర్నాథ్ ప్రాంతంలో శివసేనను అధికారానికి దూరం చేసేందుకు ఃఅంబర్నాథ్ వికాస్ అఘాడీః పేరుతో కొత్త కూటమి ఏర్పడింది. గత నెలలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో శివసేన 27 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, మ్యాజిక్ ఫిగర్ (31)కు నాలుగు సీట్ల దూరంలో నిలిచిపోయింది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్న ప్రత్యర్థి పార్టీలు ఏకమై శివసేన ఆధిపత్యానికి గండికొట్టాయి. 60 స్థానాలున్న అంబర్నాథ్ కౌన్సిల్లో బీజేపీ 14, కాంగ్రెస్ 12, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ 4 స్థానాలను గెలుచుకున్నాయి. ఈ మూడు పార్టీలు ఒకటికావడానికి తోడు ఒక స్వతంత్ర అభ్యర్థి మద్దతుతో కూటమి బలం 32కు చేరింది.మంగళవారం జరిగిన మున్సిపల్ అధ్యక్ష ఎన్నికల్లో ఃకూటమిః సమీకరణ అద్భుతంగా పనిచేసింది. శివసేన అభ్యర్థి మనీషా వాలేకర్పై బీజేపీకి చెందిన తేజశ్రీ కరంజులే పాటిల్ విజయం సాధించి, అధ్యక్ష పీఠాన్ని చేజిక్కించుకున్నారు. బీజేపీ కార్పొరేటర్ అభిజీత్ కరంజులే పాటిల్ ఈ వికాస్ అఘాడీకి నాయకునిగా వ్యవహరించారు. కాగా ఈ విచిత్ర పొత్తుపై వస్తున్న విమర్శలను బీజేపీ తిప్పికొట్టింది. మున్సిపల్ కౌన్సిల్ అధ్యక్షురాలి భర్త, బీజేపీ నేత అభిజీత్ పాటిల్ మాట్లాడుతూ గత కొన్నేళు గా అంబర్నాథ్లో వేళ్లూనుకున్న అవినీతి రాజకీయాల నుంచి ఇక్కడి ప్రజలకు విముక్తి కల్పించడమే తమ లక్ష్యమన్నారు.

## మైనంపల్లి పసుపు బియ్యం ప్రమాణం!



హైదరాబాద్, క్లాస్ రూంలో ఒక పిల్లవాడి పెన్సిల్ పోయింది. బ్యాగు మొత్తం దులిపి చూసినా దొరుకలేదు. దీంతో వెక్కి వెక్కి ఏడ్వటం మొదలుపెట్టాడు. ఇంతలో సార్ వచ్చి ఏమైందని ఆరా తీశారు. మిగతా పిల్లలను చూస్తూ 'వాడి పెన్సిల్ తీసింది ఎవరు?' అని గద్దించి అడిగారు. అయినా దొంగ ఎవరో బయటపడలేదు. పిల్లవాడి ఏడుపు మరింత పెరిగింది. దీంతో ఆ సార్ 'ఊరుకో.. పెన్సిల్ బయటికి తెప్పిస్తా' అని ధైర్యం చెప్పారు. అటెండర్ను పిలిచి 'పసుపు బియ్యం కలిపి మంత్రించి తీసుకురాపో' అని పురమాయించారు. అటెండర్ 5 నిమిషాల్లో పసుపు బియ్యం సిద్ధం చేశాడు. 'ఒకరి తర్వాత ఒకరు వచ్చి నేను పెన్సిల్ తీసుకోలేదు అని ప్రమాణం చేసి మంత్ర బియ్యం నోట్లో వేసుకోండి. దొంగతనం చేసినోడి నోరు పిడసకట్టి, వాంతులు అవుతాయి' అని హెచ్చరించాడు.ఇదంతా ఒక మూఢనమ్మకం అనుకుంటున్నారు కదా. అచ్చం ఇలాంటి ఘటనే మెదక్ పట్టణంలో జరిగింది. అదేదో మారుమూల స్కూల్లో విద్యార్థుల కోసం లోకజ్ఞానం లేని వ్యక్తి చేసింది కాదు. కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావు ఇంట్లో జరిగిన యదార్థమని మెదక్ పట్టణంలో చర్చ జరుగుతున్నది. తనపక్కనే హరీశ్రావు కోవర్టులు చేరారని మైనంపల్లికి చాలా రోజులుగా అనుమానం ఉన్నది. అవకాశం వచ్చినప్పుడల్లా ఎవరా? అని ఆరా తీస్తూనే ఉన్నా, ఎవరూ అనుమానాస్పదంగా కనిపించడం లేదు. బహిరంగంగా హెచ్చరించినా ఫలితం కనిపించలేదు. దీంతో చివరి ప్రయత్నంగా కాంగ్రెస్ నేతలను తన ఇంటికి పిలిచి పసుపు కలిపిన బియ్యం చేతిలో పెట్టి 'మేము హరీశ్రావు కోవర్టులం కాదు' అని ప్రమాణం చేయమని చెప్పినట్టు చర్చ జరుగుతున్నది.

బహిరంగంగా ప్రకటించినా..

మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీలోకి హరీశ్రావు కోవర్టులు దూరిపోయారని, కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ప్రత్యర్థులకు సమాచారం అందిస్తున్నారని మైనంపల్లి కొన్నాళ్లగా అనుమానిస్తున్నారు. నిరుడు డిసెంబర్ 16న మెదక్ జిల్లా కల్వకుంటలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ విషయాన్ని బహిరంగంగా చెప్పారు. ఎవరైనా కోవర్టులు ఉంటే వెళ్లిపోవాలని చెప్పినా వెళ్లడం లేదని, కోవర్టులను ఏరివేస్తే తప్ప పార్టీకి పునర్వైభవం రాదని చెప్పుకొచ్చారు. అప్పటి నుంచి ఆయన కోవర్టులను ఓ కంట కనిపెడుతూనే ఉన్నారని మైనంపల్లి అనుచరులు చెప్తున్నారు. కోవర్టులెవరో నిగ్గు తేల్చడానికి పార్టీ కార్యకర్తలకు, మండల, జిల్లా స్థాయి కాంగ్రెస్ నేతలకు తోచిన పరీక్షలన్నీ పెడుతూనే ఉన్నారట. కానీ ఇప్పటివరకు ఒక్క కోవర్టు కూడా బయటపడలేదని మైనంపల్లి అనుచరులు చెప్పుకుంటున్నారు. తాజాగా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన కొత్త సర్పంచులను మూడు రోజుల క్రితం మైనంపల్లి తన ఇంటికి ఆహ్వానించినట్టు తెలిసింది. ఆశీర్వాదం తీసుకోవడంతోపాటు, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా ఎవరిని నిలబెట్టాలనే అంశంపై చర్చించవచ్చనే ఆలోచనతో దాదాపు 15 మంది కాంగ్రెస్ సర్పంచులు, మెదక్ జిల్లాకు చెందిన 10 మంది కాంగ్రెస్ కీలక నాయకులు ఆయన ఇంటికి వెళ్లినట్టు సమాచారం. అందరూ సమావేశమైన తర్వాత 'మీలో ఎంతమంది హరీశ్రావు కోవర్టులు ఉన్నారో, వారంతా స్వచ్ఛందంగా లేచి వెళ్లిపోండి' అని సూచించినట్టు తెలిసింది. అయినా సర్పంచులు, నేతలు ఎవరూ లేవలేదట. దీంతో పసుపు కలిపిన బియ్యం తీసుకురమ్మని మైనంపల్లి తన భార్యకు చెప్పినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

## కేసీఆర్ గెలవాలని ఏపిలో వారు కోరుకుంటున్నారు...

అమరావతి: ఏపి సిఎం చంద్రబాబు నాయుడు, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి గురు శిష్యులు కావడంతో ఏపిలో వైసిపి గెలవాలని బిఆర్ఎస్ కార్యకర్తలు, తెలంగాణలో బిఆర్ఎస్ విజయం సాధించాలని వైసిపి కార్యకర్తలు కోరుకుంటున్నారని వైసిపి మాజీ ఎంఎల్ఏ కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం కేతిరెడ్డి మీడియాతో మాట్లాడారు. 90 శాతం మంది వైఎస్ఆర్సిపి కార్యకర్తలు తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం ఉండాలని కోరుకుంటున్నారని, అలాగే ఏపిలో జగన్ ప్రభుత్వం ఉండాలని బిఆర్ఎస్ కార్యకర్తలు కోరుకుంటున్నారన్నారు. ముందు నుంచి మాజీ సిఎం జగన్తో కేసీఆర్ కేటిఆర్కు మంచి సంబంధాలు ఉన్నాయని కొనియాడారు. వైసిపి కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం అక్రమంగా కేసులు పెడుతోందని కేతిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో బిఆర్ఎస్ కార్యకర్తలపై కూడా రేవంత్ రెడి ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతుందని దుయ్యబట్టారు. గత అసెంబ్లీ ఎన్నికలల్లో సిఆర్ 39 సీట్లు సాధించి అధికారానికి దూరమైన విషయం తెలిసిందే.



జగన్ 11 సీట్లు గెలిచి ఘోరమైన పరాజయంపాలైన విషయం విధితమే.

## సంపాదకీయం

**గురువారం 08-01-2026**

# వ్యర్థాల సద్వినియోగం.. సుస్థిరాభివృద్ధి మంత్రం

ఆత్మనిర్భర్ భారత్ సాధనకు సుస్థిరాభివృద్ధి నమూనా ఎంతగానో ఉపకరిస్తుంది. దీన్నే సర్క్యులర్ ఎకానమీగా చెబుతారు. భూమి, నీరు, ఇంధనం, ఖనిజ వనరులు పరిమితంగా ఉన్న భారతదేశం- వాటిని అత్యంత పొదుపుగా, సమర్థంగా వాడుకుంటూ అత్యధిక ఫలితాలు సాధించడానికి సర్క్యులర్ ఎకానమీ దోహదపడుతుంది. వృథను తగ్గించడం, వ్యర్థాలను పునర్వినియోగార్హంగా మార్చడం దీని ప్రధాన లక్షణం. ఇండియా ఇప్పుడు అనుసరించాల్సింది ఈ ఆర్థిక నమూనానే!భారతదేశ జీడీపీలో 30శాతం వాటాను ఆక్రమిస్తున్న పారిశ్రామిక రంగం సహజంగానే అత్యధిక ఖనిజ వనరులనూ, ఇంధనాన్నీ ఉపయోగించుకుంటోంది. ఈ క్రమంలో వ్యర్థాలూ ఎక్కువగానే ఉత్పన్నమవుతున్నాయి. ముఖ్యంగా పరిశ్రమల నుంచి పెద్దయెత్తున కార్బన్‌డయాక్సైడ్ వంటి ప్రమాదకర వాయు ఉద్గారాలు వెలువడుతున్నాయి. ప్రపంచంలో అమెరికా, చైనాల తరవాత అత్యధికంగా ఉద్గారాలను విరజిమ్ముతున్నది ఇండియానే. ప్రపంచ ఉద్గారాల్లో 9.2శాతం భారత్ నుంచే వెలువడుతున్నాయి. దేశంలో ఇప్పటికీ బొగ్గు, చమురు వంటి శిలాజ ఇంధనాలను పరిశ్రమలతోపాటు మోటారు వాహనాలూ విస్తారంగా వాడుకుంటున్నాయి. అధిక జనాభా, పట్టణాల విస్తరణ కూడా శిలాజ ఇంధనాల వినియోగం పెరగడానికి కారణమవుతున్నాయి. రానున్న దశాబ్దాలలో వనరుల వాడకంతో పాటు కాలుష్యం, కర్బన ఉద్గారాలు కూడా ఎన్నో రెట్లు పెరగనున్నాయి. పారిశ్రామిక, మున్సిపల్ వ్యర్థాలు అంతకంతకు పెరిగి పర్యావరణానికి తీరని నష్టం కలిగించే ప్రమాదముంది. దీనంతటినీ నివారించాలంటే- 'పరిమిత వనరులతో ఎక్కువ ఉత్పత్తి, తక్కువ వ్యర్థాలు' మన తారక మంత్రం కావాలి. అత్యాధునిక సాంకేతికతలు, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచడంతోపాటు వ్యర్థాలను వినియోగార్హంగా మార్చుకోవాలి.

కలిసికట్టుగా కృషి చేస్తేనే...

ప్రస్తుతం ప్రపంచార్థికంలో కేవలం 7.2శాతమే సర్క్యులర్ ఎకానమీకి మారింది. అధునాతన సాంకేతికతలతో ఈ ఆర్థిక నమూనా సాకారమైనప్పుడు పర్యావరణ ప్రయోజనాలతోపాటు సుస్థిరాభివృద్ధి సిద్ధిస్తుంది. 2015లో భారత్ 700 కోట్ల టన్నుల మేర వనరులను ఉపయోగించింది. 2030కల్లా మరో 1,420 కోట్ల టన్నులను ఉపయోగించుకోనుంది. ఇలా వాడిన వనరులలో కేవలం 20శాతాన్నే శుద్ధిచేసి పునర్వినియోగంలో పెడుతున్నారు. అదే ఐరోపా దేశాల్లోనైతే వ్యర్థాల పునర్వినియోగ రేటు ఏకంగా 70శాతం ఉంటోంది. భారత్ కూడా శరవేగంగా సర్క్యులర్ ఎకానమీకి మారి, వ్యర్థాల పునర్వినియోగంతో ఆర్థికాభివృద్ధికి కొత్త ఊతమివ్వాలి. కేంద్ర ప్రభుత్వం ఈ వాస్తవాన్ని గుర్తించి 2015లో భారతీయ వనరుల సంఘాన్ని(ఐఆర్‌పీ) నెలకొల్పింది. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల నిరోధశాఖ ఆధ్వర్యంలో ఇది ఒక సలహా సంఘంగా పనిచేస్తుంది. వనరుల విషయంలో భారతదేశ స్వావలంబన కోసం సూచనలు ఇస్తుంది. కేంద్రం 2022లో నీతి ఆయోగ్‌లో అంతర్భాగంగా సర్క్యులర్ ఎకానమీ విభాగాన్ని ఏర్పాటు చేసింది. అంతకుముందు 1999లో, థర్మల్ విద్యుత్కేంద్రాలు ఫ్లైయాష్‌ను ఉపయోగించుకోవాలని నోటిఫికేషన్ జారీచేసింది. వ్యవసాయ వ్యర్థాల పునర్వినియోగం కోసం 2023లో నోటిఫికేషన్ ఇచ్చింది. పరిశ్రమలు ఫ్లూ గ్యాస్, జీసల్ఫరైజ్డ్ జిప్సం, ఎర్రని బురదను ఉపయోగించుకోవాలని ఆదేశించింది. అనేక హానికర, సాధారణ వ్యర్థాల శుద్ధి, పునర్వినియోగానికి సంబంధించి నిబంధనలను తీసుకొచ్చింది. పరిశ్రమల వెలుపల ఉత్పన్నమయ్యే వ్యర్థాల శుద్ధి- వినియోగాలకూ మార్గదర్శకాలు జారీచేసింది. వీటి అమలుకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు కలిసికట్టుగా కృషి చేయాల్సి ఉంది. వ్యర్థాలను పునర్వినియోగించేలా పరిశ్రమలకు ప్రోత్సాహకాలివ్వాలి. దేశవ్యాప్తంగా వివిధ పారిశ్రామిక వ్యర్థాలు ఎంత పరిమాణంలో వినియోగమవుతున్నదీ తెలిపే కేంద్రీకృత సమాచార నిధిని(డేటాబేస్) రూపొందించి, అందుబాటులో ఉంచాలి. దేశవ్యాప్తంగా ఏయే పరిశ్రమలు ఎంతమేర వ్యర్థాలను వెదజల్లుతున్నాయో మ్యాపింగ్ చేసుకుంటే, వాటిని సకాలంలో శుద్ధి చేసుకోవడం వీలవుతుంది. వ్యర్థాల నాణ్యత తదితర అంశాలను ధ్రువీకరించే బాధ్యతను బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, నేషనల్ కౌన్సిల్ ఫర్ సిమెంట్ అండ్ బిల్డింగ్ మెటీరియల్స్, సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లకు అప్పగించాలి. విద్యుత్, ఉక్కు, పునరుత్పాదక ఇంధన వనరుల మంత్రిత్వ శాఖలూ ఈ బాధ్యతను స్వీకరించాలి.

సర్క్యులర్ ఎకానమీ సాధనకు...

పూర్తిగా పునరుత్పాదక ఇంధనాలతో తయారైన వస్తువులను హరిత ఉత్పత్తులుగా పరిగణించడం మంచిదే. శుద్ధిచేసిన వ్యర్థాలతో చేపట్టిన ఉత్పత్తులకూ ఈ హోదా ఇవ్వాలి. ఖనిజ వనరులను హరించే ఉత్పత్తి విధానాలను విడనాడాలి. కాలుష్య కారక ఇంధనాల వాడకాన్ని కనీస స్థాయికీ, పునరుత్పాదక ఇంధనాల వినియోగాన్ని గరిష్ఠ స్థాయికీ తీసుకెళ్లాలి. బ్యాటరీ వ్యర్థాల నిభాయింపునకు 2022లో నిబంధనలు జారీ అయ్యాయి. వీటిని ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకంతోపాటు అమలు చేయాలని గనులశాఖ ప్రతిపాదించింది. ఇతర మంత్రిత్వ శాఖలూ ఇలాంటి చర్యలు తీసుకోవాలి. ఒక రంగంలో వెలువడిన వ్యర్థాలను ఇతర రంగాల్లో ఉపయోగించుకునే ఏర్పాట్లు జరగాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టిగా సర్క్యులర్ ఎకానమీ సాధనకు సమకట్టాలి. తద్వారా సుస్థిరాభివృద్ధిని సాకారం చేయాలి.

# వెనిజులా పతనం.. భారతదేశానికి గుణపాఠం.. ఎలాగంటే..



న్యూఢిల్లీ,ఎక్కడో ఏర్పడిన తుఫాను.. అనేక ప్రాంతాలను ప్రభావితం చేస్తుంది. ఎక్కడి నుంచో వీచే చల్లని గాలులు.. సంబంధం లేని ప్రాంతాలను సైతం చల్లగా మార్చేస్తాయి.వీటిని సైన్స్ పరిభాషలో కార్యకారక సంబంధాలు అంటారు. కేవలం ప్రకృతి మాత్రమే కాదు.. దేశాల మధ్య ఏర్పడే విభేదాలు, వివాదాలు ప్రపంచాన్ని ప్రభావితం చేస్తాయి.వెనిజుల అధ్యక్షుడిని అమెరికా బలవంతంగా అరెస్ట్ చేసింది. అక్రమంగా తమ దేశానికి తీసుకెళ్ళింది. ఈ పరిణామం తర్వాత ప్రపంచంలో ఎటువంటి మార్పులు చోటు చేసుకుంటాయనే చర్చ మొదలైంది. అయితే ఇప్పుడు వెనిజులా పరిణామం భారత్ మీద కూడా బలంగా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. వెనిజులా పతనం భారతదేశానికి ఒక రకమైన హెచ్చరిక లాంటిది. సూటిగా చెప్పాలంటే ఖరీదైన గుణపాఠం లాంటిది.ఒకప్పుడు వెనిజులా అనేది స్వర్గధామం మాదిరిగా ఉండేది. లాటిన్ అమెరికాలో అత్యంత వేగంగా ఎదిగిన దేశంగా వెనిజులా పేరు సంపాదించింది. ప్రపంచ టాప్ 10 ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలిచింది. నిండుగా పర్యాటకులను కలిగి ఉండే సముద్రతీర ప్రాంతాలు.. ప్రపంచానికి అత్యధిక మిస్ వరల్డ్, మిస్ యూనివర్స్ లను అందించిన దేశంగా ఘనత సాధించింది వెనిజులా. ఈ ప్రాంతంలో ఉద్యోగం చేయాలని ప్రపంచ వ్యాప్తంగా యువత కలలు కన్నదంటే అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.హ్యూగో చావెజ్ వచ్చిన తర్వాత వెనిజులా రూప మొత్తం మారిపోయింది. పెద్ద పరిశ్రమలు ఏర్పాటు చేసిన వ్యక్తులు మొత్తం మన దేశాన్ని దోచుకుంటున్నారు అని ఆయన ఎప్పుడైతే అన్నాడో.. అప్పటినుంచి అక్కడి ప్రజలు పూర్తిగా మారిపోయారు . చమురు బావులు మొత్తం పెద్ద పెద్ద కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లో ఎందుకు ఉండాలని ఆయన ప్రశ్న అక్కడి ప్రజల్లో తీవ్రమైన మార్పు తీసుకొచ్చింది. చివరికి చావేజ్ వెనిజులా దేశానికి నాయకుడు అయ్యాడు. ప్రజలను ఉచితాల మాయలో పడేశాడు. అతడు తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రైవేట్ కంపెనీల మొత్తం ప్రభుత్వానికి సొంతమయ్యాయి.పెట్టుబడిదారులు దేశం విడిచి వెళ్లిపోయారు. ప్రజలకు ఉచిత పథకాల వల్ల డబ్బులు వచ్చాయి. పనిచేయాల్సిన అవసరం లేకుండా పోయింది. ఉత్పత్తి క్షీణించిపోయింది. జిడిపి కుప్పకూలిపోయింది. ధరల పెరుగుదల ఆకాశాన్ని అంటింది. ఆర్థికంగా వ్యవస్థ మొత్తం కుప్పకూలిపోతున్నప్పుడు చావెజ్ నోట్ల ముద్రణ అనే అంశాన్ని తెరపైకి తీసుకొచ్చాడు. అది వెనిజులా ప్రాంతాన్ని సర్వనాశనం చేసింది. చివరికి 1000 కోట్ల బొలివర్ నోట్ కూడా ముద్రించాల్సి వచ్చిందంటే అక్కడ పరిస్థితి ఎంత దారుణంగా అర్థం చేసుకోవచ్చు. కరెన్సీ నోట్లను మున్సిపాలిటీ కార్మికులు ట్రక్కుల్లో ఎత్తి పారేశారు. ఇంత జరిగినప్పటికీ అక్కడ ఉచిత పథకాల అమలు ఆగిపోలేదు. ఉచితం అనేది తమ హక్కుగా అక్కడి ప్రజలు భావించారు. శ్రమను మూర?త్వంగా భావించారు. ప్రశ్నించడానికి ద్రోహం గా అనుకున్నారు. అందువల్ల అక్కడ "civilizational brain డ్యామేజ్ అనే విధ్వంసం జరిగింది.చావేజ్ చనిపోయే ముందు నికోలస్ మదురో ను తన వారసుడిగా ప్రకటించాడు. మదురో స్వతహాగా కమ్యూనిస్టు. అయినప్పటికీ ఎన్నికల సమయంలో చర్చిలకు వెళ్లేవాడు. అతడు అధికారానికి వచ్చిన తర్వాత అక్కడ దారుణాలు పెరిగిపోయాయి. ఎన్నికలిట్ రద్దు కావడం, ప్రతిపక్షలు అణచివేతకు గురి కావడం వంటివి సాగిపోయాయి. చివరికి తనను తానే అధ్యక్షుడిగా మదురో ప్రకటించుకున్నాడు.. ప్రస్తుతం ఈ దేశానికి సంబంధించిన ప్రజలు 80 శాతం కొలంబియా, బ్రెజిల్, అర్జెంటీనాలో శరణార్థులు మాదిరిగా బతుకుతున్నారు. దేశంలో తిండి లేదు. ఉపాధి లభించడం లేదు. గౌరవం అనేది దక్కడం లేదు.. ఒకప్పుడు పర్యాటకులకు స్వర్గధామం. ఇప్పుడేమో జీవనమే నరకం లాగా ఉంది . అందమైన యువతులకు, ఐశ్వర్యానికి చిరునామాగా ఉన్న వెనిజులా ఇప్పుడు దరిద్రానికి కేరాఫ్ అడ్రస్ గా మారిపోయింది.ఉచితాల మత్తు, పరిశ్రమలపై జరిగిన దాడి, పెట్టుబడిదారులను తరిమి వేయడం, కరెన్సీ నోట్ల ద్వారా మాయ చేయడం, వారసత్వ రాజకీయాలు.. ఇలా అన్ని కలిసి వెనిజులా దేశాన్ని సర్వనాశనం చేశాయి. ఈ పరిణామలు భారత్ లాంటి దేశానికి ఒక గుణపాఠం లాంటివి. ఎందుకంటే మనదేశంలో కూడా ఉచిత పథకాలు అమలవుతున్నాయి. వీటిని అమలు చేయడానికి ప్రభుత్వాలు భూములు అమ్ముతున్నాయి. ఇక వారసత్వ రాజకీయాలు.. భావోద్వేగ ప్రకటనలు.. సెంటిమెంట్ రాజకీయాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వీటివల్ల దేశం ఎలాంటి దుర్భర స్థితి ఎదుర్కొంటుందో వెనిజులా చూపిస్తోంది. వెనిజులా ఉదాహరణతోనైనా భారత్ మేలుకోవాలి.

# రాజకీయ అవినీతికి శిక్ష ఏదీ ?



న్యూఢిల్లీ,రాజకీయ అవినీతికి శిక్షలు లేకుండా పోయాయి. విచారణలు ఏళ్లకు ఏళ్లు సాగుతుంటాయి. ఆధారాలు ఉండవు. ఉన్నా వాటిని మాయం చేస్తారు. భారతదేశంలో రాజకీయ అవినీతి కారణంగా రాజకీయ పార్టీలు ఆడిందే ఆటగా సాగుతోంది. ఉభయ తెలుగు రాష్ట్రాలను తీసుకుంటే విభజన తరవాత ఉమ్మడి ఎపి నష్టపోయినంతగా గతంలో ఏ రాష్ట్రం కూడా నష్టపోలేదు. ఈ విభజన కేవలం కెసిఆర్ కుటుంబాన్ని, జగన్ కుటుంబాన్ని మాత్రమే కోటీశ్వరులను చేసింది. విభజనతో తెలంగాణ దగాపడ్డదన్నది ముమ్మాటికీ నిజం. ఉద్యమకారుల ముసుగులో నాటి పాలకులు వ్యూహాత్మకంగా ప్రజలను నమ్మించి మోసం చేశారు. ఈ క్రమంలో అప్పులు చేసి రెండు రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి నెట్టారు. బంగారు తెలంగాణ, ధనిక తెలంగాణ అంటూ కెసిఆర్ తడిబట్టతో గొంతు కోశారు. వీరి నేరాలను రుజువు చేసేదెవరు? ఎందుకంటే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో రెండేళ్లయినా కెసిఆర్ అవినీతిపై విచారణ జరగడం లేదు. ఏ కేసులోనూ అవినీతిని రుజువు చేసే చర్యలు చేపట్టలేదు. అలాగే చంద్రబాబు నాయుడు కూడా జగన్ అవినీతి వ్యవహారాలపై మాట్లాడడం లేదు. విచారణలు జరగడం లేదు. జగన్‌ను తిట్టిపోయ డమే తప్ప చేసిదేమీ లేదు. దీనిని బట్టి రాజకీయ పార్టీలు అవగాహనతో ఉంటున్నాయన్న అనుమానం ప్రజల్లో ఉంది. అయితే తాజాగా కవిత తన సొంత కుటుంబం పైనా, బిఆర్ఎస్ వ్యవహారాల పైనా చేసిన ఆరోపణలు పరిశీలిస్తే.. గత పదేళ్లుగా ప్రజలు ఇవే అంశాలపై చర్చించారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత ఎంతగా నష్టపోయామో కుమిలిపోయారు. అందుకే కెసిఆర్‌ను ఓడించి సంబుర పడ్డారు. అయితే ఇప్పుడ చెబుతున్న విషయాలపై ఆనాడు కవిత వేటికీ స్పందించలేదు. లక్షల కోట్లకు కెసిఆర్ కుటుంబం, ఆయన అనుచరులు, ఆనాటి మంత్రులు, ఇలా అంతా పడగలెత్తారు. కానీఒక్కటంటే ఒక్కటి కూడా బయటకు రాలేదు. ఓ ఉద్యోగి వేయి రూపాయలు లంచం తీసుకుంటే పట్టుకుంటున్న పోలీసులు కూడా వారిని పట్టుకునే ప్రయత్నం చేయడం లేదు. దీనిపై కేంద్రం కూడా నాలుగు రాళ్లు వేసి ఊరుకుంటుందే తప్ప పట్టించుకోవడం లేదు. ఇలా ఏళ్లుగా అవినీతి కేసుల నుంచి రాజకీయ పార్టీల నేతలు సమర్థంగా తప్పించు కుంటున్నారు. లాలూ ప్రసాద్ యాదవ్ కేసే ఇందుకు పెద్ద ఉదాహరణ. తాజాగా కెసిఆర్ తనయ కవిత ఇప్పుడు సంచలన ఆరోపణలు చేశారు. ఎంతగా అవినీతి జరిగిందో తెలియచేశారు. తండ్రి, బావ అన్నలతో పాటు ఆనాటి మంత్రులు ఎవరెవరు ఎంతగా మేశారో చెప్పారు. వీటి ఆధారంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. దీనిపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు కూడా స్పందించి, చర్యలకు డిమాండ్ చేశారు. ఇప్పుడు నిజాయితీ నిరూపించుకోవాల్సిన బాధయత సిఎం రేవంత్‌పై ఉంది. అవినీతి పట్ల ఆచన వైఖరి ఏంటన్నది తెలియాలి. తెలంగాణ వచ్చాక మంచి జరుగుతుందని ప్రజలకు ఆశ ఉండేదని, కానీ, వారి ఆశలన్నింటినీ పదేళ్ల కాలంలో అడియాసలు చేశారని కవిత స్వయంగా ప్రకటించారు. ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వలేదు సరికదా.. తెలంగాణ కోసం పోరాడిన లక్షలాదిమంది ఉద్యమకారులకు గౌరవం కూడా దక్కలేదు. చివరికి, అమర వీరుల స్మారక స్తూపం, అంబేడ్కర్ విగ్రహం నిర్మాణంలోనూ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన తరవాత ఆమె తరచూ అవినీతిపై ఆరోపణలు చేస్తూ వచ్చారు. తనది ఆత్మగౌరవ పోరాటమని, ఆస్తుల పంచాయితీ కాదని అంటోంది. అయితే ఆస్తుల పంచాయితీ అని ఇప్పుడు స్పష్టంగా తేలిపోయింది. ఎందుకంటే లక్షల కోట్ల అవినీతి సొమ్మును దాచుకుని తనకు వాటా ఇవ్వలేదన్న బాధతోనే ఆమె బయటకు వచ్చారు. లేదా ఆస్తి అడిగతే గెంటివుంటారు. ఈ రెంటిలో ఏదో ఒకటి అయివుంటుంది. అందుకే ఆమె బాధను మింగలేక తన తండ్రి కేసీఆర్‌పైనా, ఆయన పాలనపైనా తీవ్ర ఆరోపణలు చేశారు. కొద్ది రోజులుగా తనలో దాచుకున్న ఆక్రోశాన్ని వెళ్లగక్కుతూ భావోద్వేగానికి గురయ్యారు. కొత్తగా వచ్చినవాళ్లు, ఉద్యమంతో సంబంధం లేని వాళ్లు సైతం తెలంగాణ ఉద్యమంలో తన పాత్ర ఏమిటని ప్రశ్నిస్తున్నారని, అందుకే ఈ విషయాలు చెబుతున్నానని కవిత వ్యాఖ్యానించారు. ఇక కాళేశ్వరం కెసిఆర్ ఎటిఎంగా మారిందని స్వయంగా ప్రధాని మోడీ, అమిత్ షాలు పదేపదే ఆరోపించారు పదేళ్లలో రూ. 1.89 లక్షల కోట్లు ఖర్చు చేసి 14 లక్షల ఎకరాలకే నీళ్లు ఇచ్చారని, అవే డబ్బులతో 25 లక్షలమంది పేదలకు ఇళ్లు ఇవ్వవచ్చునని తాజాగా కవిత కూడా వ్యాఖ్యానించారు. ఉద్యమకారుల సమస్యలు కేసీఆర్‌కు చేరకుండా అడ్డుగోడ కట్టారని విమర్శించిన కవిత ఆనాడు తానూ ఓ సిఎం కూతురుగా, ఎంపిగా ఉన్నానన్న విషయం మరచి పోయారు. ఈ విషయాలన్నీ ఆనాడే అంతర్గతంగా అయినా లేవనెత్తి ఉంటే వాటికి విలువ ఉండేది. తెలంగాణలో అవినీతి లేని పారదర్శక విధానాన్ని చూడాలనుకున్నామని, కానీ జరగలేదని కవిత వ్యాఖ్యానించారు. అంటే కెసిఆర్ అవినీతి పాలన నిజమే అని కవత చెప్పేశారు. పారదర్శకత అన్నది ముసుగు అన్నది కూడా తేలిపోయింది. పార్టీలో, ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని కవిత వెల్లడించారు. కొంతమంది ప్రజా ప్రతినిధులు చేస్తున్న అవినీతిని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు లేవని వివరించారు. అమరజ్యోతి, సచివాలయం, అంబేద్కర్ విగ్రహం, కలెక్టరేట్ల నిర్మాణంలో అవినీతి జరిగింది. సిద్దిపేట, సిరిసిల్లలో కట్టిన కలెక్టరేట్లు ఒక్క వర్షానికే మునిగిపోయాయి.1969 ఉద్యమకారులనూ గుర్తించలేదు. నీళ్లు, నిధులు, నియామకాల ట్యాగ్‌లైన్‌కు గండికొట్టేశారు. ఇసుక దందాల కారణంగా నేరెళ్ల లాంటి దురాగతాలు జరిగాయని, అయినా అప్పట్లో చర్యలు తీసుకోలేదని తెలిపారు. తెలంగాణ వచ్చాక కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయకపోగా పెంచి పోషించారని తప్పుబట్టారు. ధర్నా చౌక్‌ను తీసేయాలని నిర్ణయించినప్పుడు తాను వ్యతిరేకించానని, తెలంగాణ వచ్చాక ధర్నా చౌక్ ఎందుకని.. అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని కేసీఆర్ చెప్పారని, కానీ, అవేవీ అమలు కాలేదని తప్పుబట్టారు. మొత్తంగా కవిత తను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉండాలి. తన వద్ద ఉన్న ఆధారాలను ప్రభుత్వానికి లేదా విచారణకు సమర్పించాలి. తెలంగాణకు జరిగిన అన్యాయాలపై గళమెత్తాలి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే బాధలు పోతాయన్న వాదనలు తప్పని తేలింది. ఆంధ్రావాళ్లను అన్యాయంగా నిందించిన తెలంగాణ ఉద్యమకారులు ఇప్పుడు కళ్లు తెరవాలి. అసలు ద్రోహులు తెలంగాణ వారే అని గుర్తించి మరో ఉద్యమానికి సిద్ధం కావాలి.

# పరకామణి కేసులో హైకోర్టు కీలక వ్యాఖ్యలు

అమరావతి,తిరుమలలో సంచలనం సృష్టించిన పరకామణి కేసులో ఏపీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో ప్రమేయం ఉన్న పోలీసు అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. పరకామణి కేసుపై మంగళవారం హైకోర్టులో విచారణకు రాగా.. కేసు దర్యాప్తులో ముందుకు సాగాలని సీఐడీ, ఏసీబీని న్యాయస్థానం ఆదేశించింది. కౌంటింగ్ అంశంలో టేబుల్ ఏర్పాట్లపై సూచనలివ్వాలని హైకోర్టు స్పష్టం చేసింది. నిందితులతో కొందరు పోలీసులు చేతులు కలిపినట్లు సీఐడీ నివేదికలో స్పష్టంగా ఉందని.. వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చోరీ కేసు మినహా సీఐడీ, ఏసీబీ దర్యాప్తులో తేలిన ఇతర అంశాలపై దర్యాప్తు కొనసాగించుకోవచ్చని తేల్చిచెప్పింది. తదుపరి విచారణను హైకోర్టు జనవరి 8 వాయిదా వేసింది. కాగా.. ఈ కేసులో అప్పటి సీఐ జగన్ మోహన్ రెడ్డి, టూటౌన్ సీఐ చంద్రశేఖర్‌తో పాటు నిందితుడు రవికుమార్ ఆస్తులను పరిశీలించిన ఎస్ఐ లక్ష్మీ రెడ్డికి కూడా ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఈ ముగ్గురు పోలీసు అధికారులను పోలీస్

# భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఘనత కూటమిదే

విశాఖపట్నం,భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఘనత కూటమి ప్రభుత్వ విజయమని, ఈ ఘనత తమదేనంటూ ప్రచారం చేస్తున్న వైసీపీపై ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ మండిపడ్డారు. ఏ పనీచేయని వైకాపాకు ఇలాంటి ప్రచారాలు చేసుకోవడం అలవాటేనన్నారు. మంగళవారం విశాఖపట్నంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఘనత నూటికి నూరు శాతం కూటమిదేనని ఆయన స్పష్టం చేశారు. అందులో ఏ మాత్రం సందేహం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అరాచకం సృష్టించి.. సంపద లేకుండా చేశారని మండిపడ్డారు. ఇప్పుడన్నీ తామే చేశామని వైసీపీ నేతలు చెబుతారని ఆయన వ్యంగ్యంగా అన్నారు.భోగాపురం ఏయిర్‌పోర్టు వల్ల మంచి జరుగుతుందని.. దీనిని స్వాగతించాలని వైసీపీ నేతలను తాను కోరుతున్నామని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల నీటి ప్రాజెక్టులు, కృష్ణా, గోదావరి నదీ జలాల వాటా సమస్యలు పరిష్కరించుకోవడానికి ట్రిబ్యునల్స్ ఉన్నాయని గుర్తు చేశారు. బచావత్ ట్రైబునల్ కూడా సమావేశమైందన్నారు. ఏదైనా రాష్ట్రాల్రో నీటి సమస్యలు, అభ్యంతరాలు ఉంటే.. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు చెబుతారని వివరించారు. ఆ సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఏపీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా కొన్ని కొత్త ప్రాజెక్టులను ప్రకటించిందన్నారు. అలాగే పాత ప్రాజెక్టులను పూర్తి చేసుకొని ముందుకు వెళ్తోందన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు కెనాల్ పూర్తి చేసి.. కుప్పం వరకు నీళ్ల అందిస్తామని ఈ సందర్భంగా బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ ప్రకటించారు. త్వరలోనే పురుషోత్తపట్నం పూర్తి స్థాయి పనులు ప్రారంభమవుతాయని.. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు వేగవంతం అవుతున్నాయని తెలిపారు. ప్రాజెక్టులన్నీ పూర్తయితే.. ఏపీ సమగ్రాభివృద్ధి శరవేగంగా జరుగుతుందని రాష్ట్ర బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## వెనెజువెలా అధ్యక్ష భవనం వద్ద కాల్పులు

కారకాస్,వెనెజువెలా రాజధాని కారకాస్‌లోని అధ్యక్ష భవనం వద్ద భారీ కాల్పులు, పేలుళ్లు కలకలం రేపాయి. అధ్యక్షుడు నికోలస్ మదురోను యూఎస్ భద్రతా సిబ్బంది అరెస్ట్ చేసి తీసుకెళ్లిన తరువాత వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా డెల్సీ రోడ్రిగ్జ్ ప్రమాణం స్వీకారం చేశారు. ఇది జరిగిన గంటల వ్యవధిలోనే అంటే సోమవారం రాత్రి సమయంలో కారకాస్‌లోని అధ్యక్ష భవనంపై గుర్తు తెలియని డ్రోన్ సంచరించింది. దీనిని గమనించిన భద్రతా దళాలు.. డ్రోన్‌పై అటాక్ చేశాయి. భారీగా కాల్పులు జరిపాయి. ప్రస్తుతం అక్కడ వాతావరణం ప్రశాంతంగా ఉన్నట్లు సమాచారం. కాగా, ఈ కాల్పులకు ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఇదిలాఉంటే.. ఈ కాల్పుల ఘటనకు అమెరికాకు సంబంధం లేదని వైట్‌హౌస్ నుంచి ఒక ప్రకటన వచ్చింది. డ్రోన్ విషయంలో అమెరికా ప్రమేయం ఏమాత్రం లేదని ప్రకటనలో పేర్కొంది వైట్‌హౌస్. ఇకపోతే అమెరికా డెల్టా ఫోర్స్ సైన్యం జనవరి 3వ తేదీన వెనెజువెలాపై దాడి చేసి ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్య సిలియా ఎ÷-లోర్స్‌ను కస్టడీలోకి తీసుకుంది. తాజాగా నికోలస్ మదురోను, ఆయన భార్య సిలియాను అమెరికా అధికారులు న్యూయార్క్ కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టులో మదురో తన వాదనలు వినిపిస్తూ.. తాను ఏ తప్పూ చేయలేదని, తనను కిడ్నాప్ చేశారని జడ్జి ముందు స్టేట్‌మెంట్ ఇచ్చారు. మదురోపై ఉన్న నార్కో టెర్రరిజం ఆరోపణలను జడ్జి ఆల్విన్ హెల్లర్ స్టీన్ చదివి వినిపించగా.. అందుకు మదురో సమాధానం ఇస్తూ, తాను నిర్దోషినని, తనకు ఏమీ తెలియదని జవాబు ఇచ్చారు. అంతకు ముందు మదురోను కోర్టుకు తీసుకెళ్తున్న విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ వీడియోలో మదురో కుంటుతున్నట్టు నడుస్తున్నారు. మదురో చేతికి సంకెళ్లు వేసి ఉన్నాయి. బూడిద రంగు ట్రాక్‌సూట్ ధరించి ఉన్న ఆయన సాయుధ ట్రక్కు నుంచి దిగి నెమ్మదిగా హెలికాప్టర్ వైపు నడుస్తున్నారు. ఆ వీడియో చూసిన వాళ్లు మదురోకు గాయాలు అయినట్టు అనుమానిస్తున్నారు. మదురో ఇప్పటికీ తనను తాను వెనెజువెలా అధ్యక్షుడిగా న్యాయమూర్తికి పరిచయం చేసుకున్నారు. తాను అక్కడ కిడ్నాప్‌నకు గురయ్యానని చెప్పారు. కాగా, మదురో భార్య సిలియా ఫ్లోర్స్ కూడా న్యాయమూర్తికి తన వాదన వినిపించారు. తాను ఏ తప్పు చేయలేదని, పూర్తిగా అమాయకురాలినని జవాబు ఇచ్చారు. కాగా, మదురోపై మోపిన అభియోగాలను క్షుణ్ణంగా పరిశీలించిన జడ్జి ఆల్విన్ హెల్లర్ స్టీన్.. తదుపరి విచారణను మార్చి 17కు వాయిదా వేశారు.

## లక్షరూపాయల వరకు రుణమాఫీ!

హైదరాబాద్,సంక్రాంతి పండుగ వేళ తెలంగాణ రాష్ట్రంలోని చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వ్యక్తిగత రుణాలు తీసుకున్న చేనేత కార్మికులకు లక్ష రూపాయల వరకు రుణాలను మాఫీ చేయనుందని హ్యాండ్లూమ్ మరియు టెక్స్టైల్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు.ఈ నిర్ణయం అర్హులైన కార్మికుల పైన అధిక భారాన్ని తగ్గించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి దోహదం చేస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

చేనేత కార్మికులపై ఉన్న లక్ష రూపాయల వరకు రుణాల మాఫీ

ఇప్పటివరకు చేనేత కార్మికులపై ఉన్న లక్ష రూపాయల వరకు రుణాలను పూర్తిగా రద్దు చేయడానికి ప్రభుత్వం సుముఖంగా ఉందని, ఈ చర్య ద్వారా వారిపై ఉన్న అప్పుల భారాన్ని తొలగించి వారికి ఆర్థికంగా భరోసా ఇస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో వివిధ సంక్షమ పథకాల ద్వారా ప్రభుత్వం వివిధ రంగాలలో ఉన్న వారికి ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు.

చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా

ఇదే క్రమంలో తెలంగాణలో కూడా చేనేత వృత్తి వారికి ఆర్థికభరోసా కల్పిస్తామని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. కొన్ని సంవత్సరాలలో ఇందిరమ్మ చీరల పథకం, చేనేత భరోసా, పొదుపు పథకం వంటి పథకాల ద్వారా చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించినట్లు గా మంత్రి తుమ్మల స్పష్టం చేశారు ఒక పక్కన చేనేత కార్మికులకు పని కల్పించడం మాత్రమే కాక, వారికి అనేక రాయితీలను ప్రకటించి ఊరట కల్పిస్తున్నట్టు తెలిపారు.

సుమారు 6784మంది చేనేత కార్మికులకు నేరుగా ప్రయోజనం

2017 నుంచి 2024వరకు రుణమాఫీ కోసం మొత్తం 27.14కోట్ల రూపాయలను మంజూరు చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా సుమారు 6784మంది చేనేత కార్మికులు నేరుగా ప్రయోజనం పొందారని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. రుణమాఫీ ప్రక్రియతో పాటుగా చేనేత కార్మికుల సంక్షమం కోసం, ఉపాధి భద్రత కోసం ఇతర పథకాలను కూడా అమలు చేస్తున్నామని, ప్రభుత్వ అడుగడుగునా నేతన్నలకు అండగా నిలుస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

సుమారు 303 కోట్ల రూపాయలను ఆ పథకానికి కేటాయింపు

నేతన్నల భవిష్యత్తు అవసరాల కోసం అమలు చేస్తున్న చేనేత భరోసా మరియు పొదుపు పథకం కింద సుమారు 303 కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు. ఇక చేనేత కార్మికులు తీసుకునే రుణాలపైన వడ్డీ భారం లేకుండా పావలా వడ్డీ పథకాన్ని కూడా అమలు చేశారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించడంలో భాగంగా టెస్కో ద్వారా ప్రభుత్వం పెద్ద

# క్రాప్ హాలీడే ఇచ్చిన ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎత్తిపోస్తారా

మహబూబ్‌నగర్,జూరాల నుంచి పాలమూరు లిఫ్ట్ పెడితే ఒక్క చుక్క నీరు కూడా రాదని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఎన్ని రోజులు పంపింగ్ చేసినా లాభం ఉండదని అన్నారు. మహబూబ్ నగర్ జిల్లాను ఎడారిగా మార్చే ఆలోచనలు చేస్తున్నారని అన్నారు. దీనిపై ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎందుకు ఈ ప్రాజెక్టు గురించి కాంగ్రెస్ నాయకులు మాట్లాడలేదని ప్రశ్నించారు. యాసంగిలో జూరాల ప్రాజెక్టు కింద ఆయకట్టుకు క్రాప్ హాలీ డే ఇచ్చారని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి గుర్తుచేశారు. క్రాప్ హాలీడే ఇచ్చిన ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎత్తిపోస్తారా అని ప్రశ్నించారు. జూరాల నుంచి నీళ్లు ఎత్తిపోయడం అసాధ్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు మళ్లీ తొండి మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ నేతలు అజ్ఞానంతో మాట్లాడటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. బూత్‌పూర్ రిజర్వాయర్ నుంచి నీటిని ఎలా ఎత్తిపోస్తారని ప్రశ్నించారు. పాలమూరులో పడావు పడ్డ ప్రాజెక్టులపై గులాబీ పార్టీ సమరభేరీ మోగించింది. ఈ క్రమంలో జూరాల ప్రాజెక్టును మాజీ మంత్రులు నింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లతో కూడిన బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం సందర్శించింది. నార్లపూర్ పంప్‌హౌజ్, రిజర్వాయర్, ఫ్టటెం పంప్‌హౌజ్, కరివెన రిజర్వాయర్లను సందర్శించారు. ప్రాజెక్టులను పడావు పెట్టిన ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అట్టర్ ఎలాప్ అవుతుందని విమర్శించారు. కొడంగల్ లిఫ్ట్‌తో ప్రజాధనం కచ్చితంగా వృథా అవుతుందని అన్నారు. కేసీఆర్ గొప్పగా ప్రాజెక్టు డిజైన్ చేస్తే.. దాన్ని పడావు పెట్టారని మండిపడ్డారు. కాల్వలకు టెండర్లు పిలిచి పూర్తి చేస్తే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలకు నీళ్లు వస్తాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి అవగాహన లేకుంటే నిపుణులతో మాట్లాడి తెలుసుకోవాలని సూచించారు. మొబిలైజేషన్ అడ్వాన్సులు ఇచ్చి కమిషన్లు దండుకున్న ఘనత కాంగ్రెస్ పాలకులదే అని లక్ష్మారెడ్డి విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 90 శాతం పూర్తయ్యాయని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చి ఉంటే ఆరు నెలల్లోనే పాలమూరు ప్రాజెక్టు పూర్తయ్యేదని అన్నారు. ప్రాజెక్టులు పూర్తి చేయకుండా నోటికొచ్చిన అబద్దాలు మాట్లాడుతున్నారని లక్ష్మారెడ్డి మండిపడ్డారు. చంద్రబాబుకు చెప్పి రాయలసీమ ప్రాజెక్టును ఆపించానని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి అంటే ఆ వ్యాఖ్యలను ఏపీ తీవ్రంగా ఖండించిదని తెలిపారు.

# ఎసిబికి చిక్కిన మరో లంచావతారం

కామారెడ్డి, కామారెడ్డి జిల్లాలో తహసీల్దార్ ఏసీబీ వలలో చిక్కాడు. రూ. 50 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. నాగిరెడ్డిపేట మండల తహసీల్దార్గా పనిచేస్తున్న యార్లగడ్డ శ్రీనివాస్ రావుతో పాటు లంచం తీసుకోవడంతో మధ్యవర్తిగా వహించిన ప్రైవేట్ వ్యక్తి చినూరు అజయ్ అనే వ్యక్తిని పట్టుకున్నారు.మండలానికి చెందిన ఓ వ్యక్తి తన తండ్రి పేరుపై ఉన్న వ్యవసాయ భూమిని తన పేరు మీద బదిలీ చేయాలని కోరగా అందుకు లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ నేతృత్వంలో సిబ్బంది కార్యాలయంపై మాటు వేసి తహసీల్దార్ లంచం తీసుకుంటుండగా దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరిని నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# సింగరేణి భూ సేకరణ వ్యవహారం

పెద్దపల్లి, పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బుధవారంపేట గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. రామగుండం 3 ఏరియా ఓసీపీ 2 విస్తరణలో భాగంగా సింగరేణి యాజమాన్యం భూసేకరణ పనులను ప్రారంభించడంతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా.. ఎలాంటి నోటీసులు జారీచేయకుండానే ఇండ్లను కూల్చివేశారని బాధితులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కొద్దిరోజుల క్రితమే బుధవారంపేటలో ఉన్న పాత నిర్మాణాలకు ఇంటి నెంబర్లు కేటాయించిన అధికారులు, కొత్తగా వెలిసిన ఇండ్లకు అనుమతి ఇవ్వకుండా ఆదేశాలిచ్చారు. బుధవారంపేట గ్రామాన్ని పూర్తిగా సింగరేణి సేకరించాలని, లేదంటే పనులను అడ్డుకుంటామని గ్రామస్తులు హెచ్చరించినా కొద్ది రోజులుగా ఆ గ్రామంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో మంగళవారం రామగిరి పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్, రెవెన్యూ, సింగరేణి అధికారుల సమక్షంలో అక్రమ కట్టడాలనే నెపంతో బుధవారంపేటలోని పలువురు బాధితుల ఇండ్లను కూల్చివేశారు. 'అయితే ఈ కూల్చివేతకు ముందు తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని, ఆ ఇండ్ల వద్ద ఎవరులేని సమయంలోనే అధికారులు యంత్రాలతో ఇళ్లను నేలమట్టం చేశారని బాధితులు వాపోయారు. దాంతో ఆగ్రహించిన బుధవారంపేట గ్రామస్తులు మంథని?పెద్దపల్లి ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. సొంత పట్టా భూముల్లో ఇండ్లు నిర్మించుకుంటే ఎలా అక్రమమవుతాయి? నోటీసులు లేకుండా కూల్చివేతకు ఎవరు అనుమతి ఇచ్చారు?' అంటూ బాధితులు అధికారులను ప్రశ్నించారు.'జిల్లా కలెక్టర్ స్వయంగా అక్కడే ఉండి కూల్చివేతకు ఆదేశాలు ఇచ్చారని ఆరోపిస్తూ, కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పేవరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. ధర్నా కారణంగా మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న గోదావరిఖని వన్, టూ టౌన్ సీఐలు, ఎస్సైలు శ్రీనివాస్, దివ్యతోపాటు స్పెషల్ పార్టీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులతో చర్చలు జరిపారు. అయినప్పటికీ బాధితులు తమ ఆందోళనను విరమించేందుకు ససేమిరా అన్నారు.దనంతరం గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను శాంతింపజేస్తూ సానుకూలంగా చర్చలు జరిపారు. తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళనను విరమించారు. అయితే నోటీసులు లేకుండా, బాధితులకు సమాచారం ఇవ్వకుండా జరిగిన కూల్చివేతపై సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని గ్రామస్తులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## ఆస్పత్రిలో చేరిన సోనియా గాంధీ

న్యూఢిల్లీ,కాంగ్రెస్ పార్లమెంటరీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ అస్వస్థతకు గురయ్యారు. ఈ క్రమంలో ఆమెను కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రిలో చేర్పించారు. సోనియాగాంధీ తీవ్రమైన దగ్గుతో బాధపడుతున్న నేపథ్యంలో ఆమెను వైద్యులు పర్యవేక్షణలో ఉంచారు. ఆస్పత్రి వర్గాల సమాచారం ప్రకారం.. సోనియా గాంధీకి సీనియర్ పల్మనాలజిస్ట్ పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి స్థిరంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలో నెలకొన్న తీవ్ర వాయు కాలుష్యం కారణంగానే సోనియా గాంధీకి ఈ అనారోగ్యం

# లొసుగులమయంగా బెంగాల్ ఎస్ఐఆర్



కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో తీవ్రమైన అవకతవకలు, లోపాలు, లొసుగులు, అసమానతలు నెలకొన్నాయి. మతువాలు ఉ పూర్వపు తూర్పు బెంగాల్ నుండి వచ్చిన వలసదారులను మినహాయించడం అటువంటి అవకతవకల్లో ఒకటి. ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని వార్తలు వస్తున్నాయి. ఎస్ఐఆర్ ప్రక్రియను, సజావుగా, ఎలాంటి అవకతవకలు లేకుండా జరిపేందుకు మరింత సమయం కేటాయించాలని సిపిఎం సీనియర్ నేత కాంతి గంగూలీ డిమాండ్ చేశారు. టిఎంసి ఎంపీల ప్రతినిధి బృందం బుధవారం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను కలిసి ఒక మెమొరాండం సమర్పించింది. ఎస్ఐఆర్‌లోని అవకతవకలను సరిదిద్దాలని కోరింది.మతువాల భయాందోళనలు : తమ కమ్యూనిటీలో చాలామందికి 'వారసత్వ డేటా' లేనందున ఓటర్ల జాబితాలో తమ పేర్లు తొలగిస్తారనే భయాందోళనలు బంగ్లాదేశ్‌కు చెందిన హిందూ శరణార్థులు ప్రధానంగా వున్న మతువా కమ్యూనిటీలో వ్యక్తమవుతున్నాయి. సబార్ ఇనిస్టిట్యూట్ నిర్వహించిన ఒక అధ్యయనంలో వెల్లడైన అంశాలు వీరి ఆందోళనలను మరింత పెంచాయి. మతువాల ఆధిపత్యం కలిగిన నియోజకవర్గాల్లో గణనీయంగా ఓటర్ల తొలగింపులు జరిగినట్లు ఆ సర్వేలో వెల్లడైంది. వీరిలో చాలామందిని 'శాశ్వతంగా తరలిపోయారు' లేదా 'ఆచూకీ తెలియలేదు' అనే కేటగిరీల్లో చేర్చారు. ఇప్పటికే సామాజికంగా, ఆర్థికంగా వెనకబడి వున్న ఈ కమ్యూనిటీకి చెందిన వారి పేర్లు తాజాగా ఓటర్ల జాబితాలో లేకపోవడం గమనార్హం.

ఎస్ఐఆర్ ప్రక్రియలో వ్యవస్థాగత తప్పులు

వ్యవస్థలోని సాంకేతిక సమస్య ముఖ్యంగా 2002నాటి ఓటర్ల జాబితా డేటా అసంపూర్తిగా మార్పిడి కావడంతో మ్యాపింగ్ సమస్య తలెత్తింది. ఓటర్లుగా జాబితాలో చేర్చాల్సినవారిని 'మ్యాపింగ్ చేయనివారు'గా ముద్ర వేసే పరిస్థితికి దారి తీసింది. ఈ వ్యవస్థాగతమైన తప్పు వృద్ధుల్లో, వికలాంగుల్లో ఆందోళనలకు, ఇబ్బందులను కలిగించే అవకాశం వుంది.

స్థానిక ఎన్నికల అధికారుల ఆందోళనలు

ఒక వ్యక్తి చట్టబద్ధమైన ఓటరు అవునా, కాదా అని నిర్ణయించగలిగే స్థానిక ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారుల (ఇఆర్ఓ) చట్టబద్ధమైన పాత్రను ఈ ప్రక్రియలో పక్కకు నెడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు పాత్ర లేకుండా చేయడం, ఓటర్ల తొలగింపు నోటీసులు ఆటోమేటిక్‌గా రూపొందే కేంద్రీకృత పోర్టల్ ఎన్నికల కమిషన్ వద్దే వుండడం పట్ల ఇఆర్ఓలు, ఎఇఆర్ఓలు ఆందోళనలు, అభ్యంతరాలు వెలిబుచ్చుతున్నారు. ఓటరు పేరు తొలగింపు నోటీసులు జారీ చేయాల్సిన బాధ్యత చట్టప్రకారం ఇఆర్ఓలది, జాబితానుండి వారి పేర్లను తొలగించడానికి ముందుగా వారు చెప్పేవి వినేందుకు కనీసం అవకాశం వుండేది. తాజా పరిస్థితుల్లో ఆ అవకాశం వుండడం లేదు. కొన్ని కేసుల్లో ఇఆర్ఓల ప్రమేయం అసలు వుండడం లేదు. దీంతో వారిలో గందరగోళం నెలకొంది. పేర్లు ఎందుకు తొలగించారో తెలుసుకునే హక్కు ప్రజా ప్రాతినిధ్య చట్టం నిబంధనల మేరకు ఓటర్లకు వుంది. కానీ ఇక్కడ అది ఉల్లంఘించబడుతోంది.

బాధితులు హిందూ శరణార్థులే : సిపిఎం నేత కాంతి గంగూలీ వ్యాఖ్యలు

ఎస్ఐఆర్ చాలా పెద్ద సవాలుగా మారిందని సిపిఎం సీనియర్ నేత, మాజీ మంత్రి కాంతి గంగూలీ వ్యాఖ్యానించారు. ఈ ప్రక్రియను మరింత సజావుగా, ఎలాంటి అవకతవకలు లేకుండా కచ్చితంగా సాగించాలంటే మరింత సమయం కేటాయించాల్సిన అవసరం వుందని ఆయన స్పష్టం చేశారు. కేవలం రెండు మూడు నెలల్లో పూర్తి చేయడానికి బదులుగా సుదీర్ఘకాలంలో అమలు చేయాల్సి వుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సాగుతున్న ఈ ప్రక్రియ వల్ల అధికంగా ప్రభావం పడేది హిందూ శరణార్థులపైనే అని అన్నారు. వారంతా బంగ్లాదేశ్ నుండి పారిపోయి పశ్చిమ బెంగాల్‌లో స్థిరపడిన హిందువులేనన్నారు. 82 ఏళ్ల కాంతి గంగూలీ శుక్రవారం డాక్యుమెంట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సి వుంది. భారతదేశం చాలా పెద్ద దేశమని, జనాభా ఎక్కువని, ఇటువంటి చోట్ల ఓటర్ల జాబితాను మరింత మెరుగైన రీతిలో సవరించాలంటే మరింత సమయమివ్వక తప్పదని అన్నారు. "నేను సుందర్‌బన్స్ ప్రాంతానికి చెందిన వ్యక్తిని. బంగ్లాదేశ్ నుండి వచ్చి ఇక్కడ నివసిస్తున్న హిందువులు పెద్ద సంఖ్యలో వున్నారు. తాజా ప్రక్రియ వల్ల ప్రభావం పడేది వారిపైనే' అని అన్నారు. ఓటర్లు గందరగోళపడకుండా, ఊహాగానాలు, నిర్ధారణ కాని అంశాలు ప్రచారమవకుండా వుండేలా ఎన్నికల కమిషన్ సక్రమ మార్గదర్శకాలు జారీ చేయాలని గంగూలీ సూచించారు.

# వెనిజులా విషయంలో భారత్ ప్రకటనపై విమర్శలెందుకు వస్తున్నాయి?



వాషింగ్టన్:అమెరికా ప్రత్యేక దళాలు శనివారం తెల్లవారుజామున వెనెజ్వెలా రాజధాని కారకస్ నుంచి అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను అదుపులోకి తీసుకున్నాయి.ఇరువురిని న్యూయార్క్‌కు తరలించారు, అక్కడ మాదకద్రవ్యాల అక్రమ రవాణా ఆరోపణలపై విచారణ జరగనుంది. ఈ ఆరోపణలను మదురో ఖండిస్తూ వచ్చారు. దేశంలోని విస్తారమైన చమురు నిల్వలపై నియంత్రణకు ఇది అమెరికా చూపుతున్న సాకుగా ఆయన ఆరోపించారు.వెనెజ్వెలాపై ఈ చర్య ప్రపంచాన్ని షాక్‌కు గురిచేసింది. అనేక దేశాలు అమెరికా చర్యను cఏకపక్షంగా, ఐక్యరాజ్యసమితి చార్టర్‌కు విరుద్ధంc అని అభివర్ణించాయి.అమెరికా అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించిందని, దక్షిణ అమెరికా ప్రాంతానికి ముప్పుగా పరిణమించిందని చెబుతూ, మదురోను వెంటనే విడుదల చేయాలని చైనా డిమాండ్ చేసింది.ఐక్యరాజ్యసమితి చార్టర్, అంతర్జాతీయ చట్టం సూత్రాల ప్రకారం సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించింది. వెనెజ్వెలా సార్వభౌమత్వానికి హామీ ఇవ్వాలని క్రైస్తవ నాయకుడు పోప్ లియో విజ్ఞప్తి చేశారు.భారత్ మాత్రం చాలా జాగ్రత్తగా, ఆచితూచి స్పందించింది. ఈ స్పందనపై చాలానే విమర్శలు వచ్చాయి.

భారత ప్రకటనలో ఏముంది?

అమెరికా చర్య అనంతరం, దాదాపు 24 గంటల తర్వాత భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదివారం చేసింది.cవెనెజ్వెలా ప్రజల భద్రత. శ్రేయస్సు కోసం భారత్ తన మద్దతు ఉంటుందని పునరుద్ఘాటిస్తోంది. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కొనసాగేందుకు చర్చలు, శాంతియుత మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సంబంధిత అన్ని పక్షలకు విజ్ఞప్తి చేస్తున్నాంc అని తెలిపింది.అలాగే వెనెజ్వెలా ప్రయాణానికి సంబంధించి భారత్ ఒక అడ్వైజరీని కూడా జారీ చేసింది. వెనెజ్వెలాకు అత్యవసరమైతే తప్ప ప్రయాణించరాదని భారత పౌరులకు సూచించింది.అయితే, ఈ ప్రకటన దేశంలోని ప్రతిపక్ష పార్టీలకు అసహనం కలిగించింది. అమెరికా దురాక్రమణను ఖండించనందుకు చాలామంది విమర్శలు గుప్పించారు.గత 24 గంటలుగా వెనెజ్వెలాలో అమెరికా చేపట్టిన చర్యలపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. అంతర్జాతీయ చట్ట నిబంధనలను ఏకపక్షంగా ఉల్లంఘించలేంc అనితెలిపారు.అమెరికా రహస్య ఆపరేషన్ జరిగిన 24 గంటల తర్వాత న్యూఢిల్లీ స్పందించిందని ఆంగ్ల వార్తాపత్రిక ఃది టెలిగ్రాఫ్ః రాసింది.cఈ ప్రతిస్పందన ఫిబ్రవరి 2022లో యుక్రెయిన్‌పై రష్యా దాడి సమయంలో భారత్ ఇచ్చిన ప్రతిస్పందనను పోలి ఉంది. ఆ సమయంలో, అది ఏ ఒక్క పక్షానికి బహిరంగంగా మద్దతు ఇవ్వలేదుc అని ది టెలిగ్రాఫ్ రాసింది సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, సీపీఐ(ఎంఎల్)-లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య (ఎడమ నుంచి కుడికి).

నిరసనలకు వామపక్షల పిలుపు

వెనెజ్వెలాపై అమెరికా దాడిని భారతదేశంలోని వామపక్ష పార్టీలు ఖండించాయి.అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు నిరసనలకు పిలుపునిచ్చాయిc అని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) తెలిపింది.ఈ ప్రకటనను సీపీఐ, సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్)-లిబరేషన్, ఆర్ఎస్పీ (రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ), ఏఐఎఫ్బీ (ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్)లు సంయుక్తంగా జారీ చేశాయి.cవెనెజ్వెలాపై అమెరికా దురాక్రమణను, అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్ కిడ్నాప్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది యూఎన్ చార్టర్‌ను స్పష్టంగా ఉల్లంఘిస్తూ సార్వభౌమ దేశంపై జరిగిన దాడి. వామపక్ష పార్టీలమైన మేం, అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా, లాటిన్ అమెరికా ప్రజలతో సంఘీభావంగా దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిస్తున్నాంc అని ప్రకటన పేర్కొంది.cఅమెరికా దురాక్రమణను ఖండిస్తున్న దేశాలకు భారత ప్రభుత్వం మద్దతివ్వాలి. వెనెజ్వెలాతో గట్టిగా నిలబడాలిc అని ఆ పోస్టులో రాశారు.

భారత్ ప్రకటనపై విమర్శలు ఎందుకు?

cవెనెజ్వెలా చమురు కోసం ఎన్ని సాకులు చెప్పినా, చరిత్ర వారిని ఎప్పటికీ క్షమించదు. అది కూడా మనల్ని క్షమించదు. ఎందుకంటే, మనం ఇప్పటికీ ఈ రకమైన భాషను ఉపయోగిస్తున్నందుకు మనల్ని కూడా క్షమించదు. ఇది మన భారతదేశం కాదు. 1952, 54లలో ఇలాంటిది జరిగి ఉంటే భారత్ స్పష్టమైన, బలమైన ప్రకటన జారీ చేసి ఉండేది అనిఅన్నారు.వెనెజ్వెలాలో అమెరికా ఆపరేషన్‌పై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది కానీ, ఖండించలేదుc అని అంతర్జాతీయ వ్యవహారాలను కవర్ చేసేరాశారు.వెనెజ్వెలాలోకి ట్రంప్ సైనిక చొరబాటును భారత్ ఖండించలేదుc అని సదరన్ కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంతో అనుబంధంగా ఉన్న యూఎస్సీ డోర్న్‌సైఫ్ కాలేజ్ ఆఫ్ లెటర్స్, ఆర్ట్స్ అండ్ సైన్సెస్‌లో ఎక్స్ః పోస్టులో రాశారు.భారత్ ఆసియాలో, ప్రపంచవ్యాప్తంగా మా అత్యంత ముఖ్యమైన భాగస్వాములలో ఒకటిc అని వాషింగ్టన్‌కు చెందిన భౌగోళిక రాజకీయ వ్యూహకర్త, విదేశాంగ విధాన పరిశోధన సంస్థలో అన్నారు.కానీ, ఇది ఃనేషనల్ ప్రైమసీ థియరీః కింద నిర్వహించిన ఆపరేషన్. ఇది ట్రంప్ వైట్‌హౌస్ జాతీయ భద్రతా వ్యూహంలో స్పష్టంగా కనిపించే ఫ్రేమ్‌వర్క్ అని తెలిపారు.భారత్, అమెరికాలు ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసి పనిచేయడం కొనసాగిస్తాయని జాన్ సిటిలిడిస్ చెప్పారు.

విదేశాంగ విధానాన్ని మార్చాలిః

భారత ప్రకటన ఆందోళనకరంగా ఉందని, దాని విదేశాంగ విధానంలో పూర్తి మార్పు జరగాలని భారత్ – చైనా సంబంధాల నిపుణులు అభిప్రాయపడ్డారు. భారత ప్రకటనను ఃఎక్స్ః వేదికగా జోరావర్ షేర్ చేస్తూ, cభారత విదేశాంగ విధానానికి ఒక ప్రధాన నమూనా మార్పు అవసరం. ఎందుకంటే, అలాంటి ప్రతిస్పందన ఎటువంటి నిర్దిష్ట ప్రయోజనాలను ఇవ్వదు లేదా భవిష్యత్తులో అమెరికా దూకుడు చర్యలను నిరోధించదు అని తెలిపారు.భారత అధికారిక ప్రకటనలు అసంబద్ధంగా మారాయని ఇది సూచిస్తుంది అని రాశారు.వ్యూహాత్మక వ్యవహారాల నిపుణులు బ్రహ్మ చెల్లానీ కూడా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.ఘటనను తీవ్ర ఆందోళన కలిగించేదిగానే చెబుతూ, ట్రంప్ ప్రభుత్వంతో సంబంధాలు దెబ్బతినకుండా, అటు ఏకపక్ష సైనిక చర్యకూ మద్దతు ఇవ్వకుండా న్యూఢిల్లీ సంకేతాలిచ్చింది అని తెలిపారు.అయితే, యూఎన్ చార్టర్ ఆర్టికల్ 2(4) (బలప్రయోగం నిషేధం) స్పష్టమైన ఉల్లంఘనను భారత్ ఖండించడంలో విఫలమైందంటూ విమర్శకులు ఎత్తిచూపుతారు. గ్లోబల్ సౌత్ లీడర్‌గా భారత్ స్థానాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని వాదిస్తారుc అని తెలిపారు బ్రహ్మ చెల్లానీ. చాచీ×వెనెజ్వెలా సమస్యపై ఎలా స్పందించాలో భారత ప్రభుత్వం నిర్ణయించుకోవాలని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అన్నారు.

చాకచక్యమైన దౌత్యంతో నడిపించాలి: శశి థరూర్

ప్రస్తుత సున్నిత పరిస్థితిలో భారత్ స్పందన సముచితమేనన్నట్లుగా కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ పరోక్షంగా వ్యాఖ్యానించారు.వెనెజ్వెలా సమస్య సున్నితత్వాన్ని దృష్టిలో ఉంచుకుని, ఎలా స్పందించాలో నిర్ణయించుకోవడం భారత ప్రభుత్వానికే వదిలేశామని చెప్పారు.ఐక్యరాజ్యసమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాన్ని నిరంతరం ఉల్లంఘిస్తున్నారు. మనం చూస్తున్న పరిస్థితి ప్రపంచ క్రమం విచ్ఛిన్నమై, దాని స్థానంలో గందరగోళం ఏర్పడుతుందని సూచిస్తుంది. అటువంటి గందరగోళంలో, ఃమైట్ ఈజ్ రైట్ః అనే సూత్రం ఆటవిక చట్టంగా మారే ప్రమాదం ఉంది. భారత్ ఒక చిన్న దేశం కాదు లేదా సూపర్ పవర్ కాదు, మనం ఈ దశను చాలా చాకచక్యమైన దౌత్యంతో నడిపించాలిc అని అన్నారు..

ది హిందూ దౌత్య వ్యవహారాల ఎడిటర్

వెనెజ్వెలాపై అమెరికా దాడి విషయంలో మోదీ ప్రభుత్వం తన వైఖరిని చాలా జాగ్రత్తగా తీసుకుంది. యుక్రెయిన్, గాజా, ఇరాన్ విషయంలో భారత్ అనుసరించిన వైఖరికి అనుగుణంగానే ఇది కూడా ఉందని దౌత్య నిపుణులు అంటున్నారు. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం ప్రస్తుతం కీలక దశలో ఉంది. దీనిని ప్రధాన ఆందోళనగా కూడా పరిగణిస్తున్నారుc అని తెలిపారు.

# సోయా కొనుగోళ్లపై ఆందోళన

ఆదిలాబాద్:ప్రభుత్వం వెంటనే సోయా కొనుగోళ్ల చేపట్టాలని మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బంద్‌కు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. దీంతో పట్టణంల వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. పట్టణంలో బిఆర్ఎస్ బైక్ ర్యాలీ నిర్వహించింది. ఈ క్రమంలో ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించడానికి మాజీ మంత్రి జోగు రామన్నతో పాటు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. జోగు రామన్న ఆధ్వర్యంలో ఈ బంద్ నిర్వహించారు. సోయా కొనుగోలులో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు గిట్టుబాటు ధరలు, సరైన రాయితీలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈక్రమంలో ఆర్టీసీ డిపో వద్ద పోలీసు బలగాలు భారీగా మోహరించాయి. జోగు రామన్నతో సహా పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. జోగు రామన్న ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సోయా కొనుగోలుపై బంద్ నిర్వహించాలని పిలుపునిచ్చారు. గత కొంత కాలంగా సోయా రైతులు పడుతున్న ఇబ్బందులపై పోరాటం చేస్తున్నారు. ముఖ్యంగా సోయా కొనుగోలులో గిట్టుబాటు ధరలపై సరైన ఆధారిత విధానాలు లేకపోవడంపై పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలోనే బంద్‌కి పిలుపునిచ్చారు. ఈ క్రమంలో బస్సుల రాకపోకలను నేతలు అడ్డుకున్నారు. ఆర్టీసీ డిపో వద్దకు పోలీసులు భారీగా చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న జోగు రామన్నతో సహా పలువురు నేతలను అరెస్టు చేశారు. జోగురామన్న తమ పోరాటాన్ని విస్తృతం చేయడంలో భాగంగా ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు మీడియాతో మాట్లాడారు. అన్నదాతలకు సరైన గిట్టుబాటు ధరలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రస్తుత విధానాలకు వ్యతిరేకంగా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. రైతన్నల సమస్యలను గుర్తించి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యలపై తాము పోరాడుతుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తమపై కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. రైతులు సరైన గిట్టుబాటు ధరలేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాతలకు న్యాయం చేసేవరకు తాము పోరాడు తామని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమం పెద్దఎత్తున జరుగుతున్న సమయంలో పోలీసులు భారీ బలగాలతో ఆర్టీసీ డిపో వద్దకు చేరుకున్నారు. ప్రజల మౌలిక హక్కులపై అడ్డగోలుగా ఇబ్బందులు కలిగించకుండా జాగ్రత్త తీసుకోవాలని వారిని హెచ్చరించారు. అయితే, ఆందోళన చేస్తున్న జోగు రామన్నతో సహా మరికొంతమంది నేతలను అరెస్టు చేశారు. ఈ ఘటనతో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనల నేపథ్యంలో జోగు రామన్నతో పాటు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, గులాబీ శ్రేణులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని మండిపడ్డారు. తాము శాంతియుతం గా ధర్నా చేస్తుంటే పోలీసులు ఎందుకు అరెస్ట్ చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పాలమూరు మళ్లీ దివాలా తీసేలా కుట్రలు

మహబూబ్‌నగర్,ఉమ్మడి ఏపీలో అత్యంత దారుణంగా నష్టపోయిన జిల్లా పాలమూరు అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పాలమూరు జిల్లాను మంత్రులు ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. ఆస్తులు కూడబెట్టుకున్నారు తప్ప రైతులను ఆదుకోలేదని విమర్శించారు. పాలమూరులో పడావు పడ్డ ప్రాజెక్టులపై గులాబీ పార్టీ సమరభేరీ మోగించింది. ఈ క్రమంలో జూరాల ప్రాజెక్టును మాజీ మంత్రులు నింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లతో కూడిన బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం సందర్శించింది. నార్లపూర్ పంప్‌హౌజ్, రిజర్వాయర్, ఫ్టటెం పంప్‌హౌజ్, కరివెన రిజర్వాయర్లను సందర్శించారు. ప్రాజెక్టులను పడావు పెట్టిన ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీలో రెండు ట్రిబ్యునల్‌లు ఏర్పాటైనా పాలమూరును పట్టించుకోలేదని అన్నారు. జూరాల ప్రాజెక్టు మొత్తం ఎండిపోతుందని శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. యాసంగి పంటలకు జూరాల ఆయకట్టుకు క్రాప్ హాలీడే ఇచ్చారని తెలిపారు. ఈ జూరాల నుంచి 70 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తారా అని ప్రశ్నించారు. ఇదేం ప్రభుత్వం? అసలు నీళ్ల మీద సోయి ఉందా అని నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును 90 శాతం పూర్తి చేసుకున్నామని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తట్టెడు మన్ను తీయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తారా అని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. పాలమూరు మళ్లీ దివాలా తీసేలా కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. పాలమూరును సస్యశ్యామలం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. రాజకీయ కోణంలో చూడకుండా పాలమూరు బాగు చేయాలని సూచించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ 45 టీఎంసీలకు ఒప్పుకోమని తెలిపారు. మా పాలమూరు జిల్లాకు కేటాయించిన నీళ్లు మాకు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు మిరిచ్చిన నీళ్ల కంటే డబుల్ నీళ్లను కేటాయించుకుంటామని తెలిపారు.

# భోగాపురం పూర్తి చేసిన ఘనత బాబుదే

అమరావతి,భోగాపురం విమానాశ్రయానికి అనుమతులు తీసుకుని రావడంతో పాటు, పూర్తి చేసిన ఘనత సిఎం చంద్రబాబుకు దక్కుతుందని తెదేపా నేత పట్టాభిరామ్ అన్నారు. పట్టుదలతో విమానాశ్రయం పూర్తి చేయించిన చంద్రబాబు అభినదనీయుడన్నారు. అయితే దీనికి అనుమతులు తెచ్చామంటూ వైకాపా అవాస్తవాలు ప్రచారం చేస్తోందని పట్టాభిరామ్ అన్నారు. 2016లోనే సైట్ క్లియరెన్స్ అనుమతులను సీఎం చంద్రబాబు సాధించారని చెప్పారు. భూసేకరణతో పాటు రైతులకు నష్టం జరగకుండా జీవో ఇచ్చారన్నారు. విమానాశ్రయానికి చంద్రబాబే అంకురార్పణ చేశారని వివరించారు. భోగాపురం విమానాశ్రయంపై పట్టాభి ప్రజెంటేషన్ ఇచ్చారు. భోగాపురం విమానాశ్రయానికి చంద్రబాబు ఎస్పీవీ ఏర్పాటుచేశారు. దీనికోసం అధికారులను నియమించారు. చంద్రబాబు క్రెడిట్ చోరీ చేస్తున్నట్లు వైకాపా పేటీఎం బ్యాచ్‌లు ఆరోపిస్తున్నాయి. వైకాపా పాత్ర ఇక్కడ ఏమీ లేకపోయినా తామే చేసినట్లు చెప్పుకొంటున్నారు. విమానాశ్రయం నిర్మాణాన్ని అడ్డుకుంటామని పార్టీ నేతలు గతంలో వ్యాఖ్యానించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు క్రెడిట్ చంద్రబాబుకే దక్కుతుంది. ఈ ప్రాజెక్టు వేగవంతానికి 2017లోనే స్టీరింగ్ కమిటీ ఏర్పాటైంది. కీలకమైన పర్యావరణ అనుమతులు తీసుకొచ్చాం' అని పట్టాభి వివరించారు.

## తెలంగాణ ప్రభుత్వం ప్రకటన

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి సెలవులను ప్రకటించింది. జనవరి 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు అన్ని పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇస్తున్నట్లు ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. ఈ సెలవులు ప్రభుత్వ, ప్రైవేటు, వాణిజ్య పాఠశాలలకు వర్తిస్తాయని పేర్కొంది. జనవరి 16వ తేదీన కనుమ రోజును పురస్కరించుకుని ఐచ్ఛిక సెలవు కూడా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. కనుమ రోజున రైతులు తమ పండుగను ప్రత్యేకంగా చేసుకుంటారు. కనుమ రోజున ఉత్సవాలు, పండుగ సంబరాలు జరుపుకోవడం

# పుట్టపర్తి భక్తురాలికి అధ్యక్ష పీఠం..వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా బాబా శిష్యురాలు!



పుట్టపర్తి: అంతర్జాతీయ రాజకీయాల్లో పెను సంచలనం చోటుచేసుకుంది. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా అరెస్ట్ చేసిన దరిమిలా, ఆ దేశ సుప్రీంకోర్టు ఉపాధ్యక్షురాలిగా ఉన్న డెల్సీ రోడ్రిగ్స్‌ను తాత్కాలిక అధ్యక్షురాలిగా నియమించింది. అయితే, ఆమె రాజకీయ ప్రస్థానం కంటే ఇప్పుడు ఆమెకు భారతదేశం, ముఖ్యంగా పుట్టపర్తి సత్యసాయి బాబాతో ఉన్న ఆధ్యాత్మిక బంధం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

పుట్టపర్తితో విడదీయరాని అనుబంధం

డెల్సీ రోడ్రిగ్స్ కేవలం వెనెజువెలా రాజకీయ నాయకురాలే కాదు, శ్రీ సత్యసాయి బాబాకు పరమ భక్తురాలు. ఆమె గతంలో పలుమార్లు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయాన్ని సందర్శించారు. 2023 ఆగస్టులో మరియు ఇటీవలే 2024 అక్టోబర్ 26న ఆమె పుట్టపర్తిలో పర్యటించారు. సాయి కుల్వంత్ మందిరంలోని బాబా మహాసమాధిని దర్శించుకుని ఆమె ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆ సమయంలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ ఆమెకు ఆశ్రమ సేవా కార్యక్రమాలను వివరించారు. cబాబా సన్నిధిలో గడపడం నాకు వర్ణించలేని మానసిక శాంతిని ఇస్తుందిc అని ఆమె గతంలో వ్యాఖ్యానించారు.

వైరల్ అవుతున్న ఫోటోలు

రోడ్రిగ్స్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన వెంటనే, ఆమె పుట్టపర్తి ఆశ్రమంలో సాధారణ భక్తురాలిలా కూర్చుని ఉన్న ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఒక దేశాధినేత స్థాయి వ్యక్తి భారతీయ ఆధ్యాత్మికత పట్ల ఇంతటి భక్తిని చాటుకోవడం విశేషం.

వెనెజువెలాలో భారతీయ ఆధ్యాత్మికత

వెనెజువెలాలో కేవలం డెల్సీ రోడ్రిగ్స్ మాత్రమే కాదు, వేల సంఖ్యలో సత్యసాయి భక్తులు ఉన్నారు. అక్కడ బ్రహ్మకుమారీలు, రాధాస్వామి వంటి ఆధ్యాత్మిక సంస్థలకు కూడా మంచి ఆదరణ ఉంది. ఇప్పుడు భారతీయ సంప్రదాయాలను గౌరవించే వ్యక్తి దేశ అత్యున్నత పదవిని చేపట్టడంతో, భారత్-వెనెజువెలా మధ్య సంబంధాలు మరింత బలపడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# తెలుగు అమ్మాయి నిఖిత కేసులో.. దిగ్భ్రాంతి కలిగించే నిజం



హైదరాబాద్, అగ్రరాజ్యం అమెరికాలో గొడిశాల నిఖిత అనే తెలుగమ్మాయి దారుణమైన హత్యకు గురైంది. ఈ ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత అనేక విషయాలు బయటపడుతున్నాయి. అయితే ఇప్పుడు ఈ కేసు కు సంబంధించి దిగ్భ్రాంతి కరమైన వాస్తవం వెలుగులోకి వచ్చింది. నిఖిత హత్యకు ప్రేమ వ్యవహారం కారణమై ఉంటున్నది అందరూ అనుకున్నారు. అన్ని మీడియా సంస్థలులో కూడా అదే తీరుగా వార్తలు వచ్చాయి. అయితే ఆమె అలా హత్యకు గురికావడానికి ప్రధాన కారణం ప్రేమ వ్యవహారం కాదని, ఆర్థికపరమైన విషయాలని తేలింది. నిఖిత ఉన్నత చదువుల నిమిత్తం కొంతకాలం క్రితం అమెరికాకు వెళ్లిపోయింది. ఆమె అక్కడే ఉండి చదువుకుంటున్నది. తమిళనాడు రాష్ట్రానికి చెందిన అర్జున్ శర్మ కూడా అమెరికాలో ఉంటున్నాడు. అర్జున్ శర్మ, నిఖిత స్నేహితులు. కొంతకాలంగా అర్జున్ శర్మ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో అర్జున్ శర్మకు నిఖిత నాలుగున్నర వేల డాలర్లు అప్పుగా ఇచ్చింది. డబ్బులు తీసుకున్న అర్జున్ శర్మ.. ఇవ్వడం మాత్రం మర్చిపోయాడు. తాను ఇచ్చిన డబ్బులను నిఖిత అడుగుతుంటే అతడు ఏమాత్రం స్పందించడం లేదు. ఫోన్ చేసినప్పటికీ స్పందించలేదు. తాను ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వాలంటూ నిఖిత అర్జున్ మీద ఒత్తిడి తేవడం మొదలు మొదలుపెట్టింది. దీంతో అర్జున్ మూడున్నర వేల డాలర్లు తిరిగిచ్చాడు. మిగతా వెయ్యి డాలర్ల కోసం నిఖిత ఒత్తిడి తేవడం మొదలుపెట్టింది. దీంతో అగ్రహానికి గురైన అర్జున్.. ఆమె ద్వారా మూడున్నర వేల డాలర్లను తన ఖాతాలకు బదిలీ చేయించుకున్నాడు. అనంతరం ఆమెను దారుణంగా హత్య చేశాడు. ఆ తర్వాత ఇండియాకు తిరిగివచ్చాడు. నిఖిత హత్యకు సంబంధించి ఇంటర్ పోల్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు తమిళనాడు వచ్చారు. అర్జున్ శర్మను అరెస్ట్ చేశారు. కేసు నమోదుచేసి, దర్యాప్తు ప్రారంభించారు. నిఖిత హత్యకు గురికావడంతో ఆమె తండ్రి ఆనంద్ కన్నీటి పర్యంతమవుతున్నాడు. " చాలా ఏళ్ల క్రితం మా అమ్మాయి అక్కడికి వెళ్ళిపోయింది. అక్కడ చదువుకుంటున్నది. గతంలో అతడు మా అమ్మాయి రూమ్ మేట్ గా ఉన్నాడు. చాలాసార్లు మా అమ్మాయిని డబ్బులు అడిగాడు. ఇప్పుడు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరితే హత్య చేశాడు.. నిఖితను హత్య చేసి.. తనకు ఏమీ తెలియనట్టుగా పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఆ తర్వాత అమెరికా నుంచి పారిపోయి వచ్చాడు. మేరీ ల్యాండ్ ప్రాంతంలో డేటా అనలిస్టుగా నా కుమార్తె పని చేస్తోంది. నా కూతురికి జరిగిన అన్యాయం ఎవరికీ జరగొద్దు. నా కుమార్తె మృతదేహాన్ని త్వరితగతిన ఇండియాకు తీసుకొచ్చే ఏర్పాట్లను అధికారులు చేయాలని కోరుతున్నానని" నిఖిత తండ్రి ఆనంద్ పేర్కొన్నాడు.

# రూపాయిలో పావలా ఆంధ్రకే...

విజయవాడ, ఏపీ ప్రభుత్వం పనితీరు ప్రస్తావన జాతీయస్థాయిలో మరోసారి చర్చకు వచ్చింది. పెట్టుబడులను ఆకర్షించడంలో ముందు వరుసలో నిలిచిన ఏపీ జాతీయస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. ప్రపంచంలోనే ప్రముఖ మేగజైన్ ఫోర్బ్స్ తన బిజినెస్ ఎడిషన్ లో దీనిని ప్రచురించింది. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏపీ పెట్టుబడులను ఆకర్షించింది. 2025 ఏప్రిల్ ? డిసెంబర్ వరకు భారతదేశ వ్యాప్తంగా వచ్చిన పెట్టుబడుల్లో పావలా శాతం ఏపీనే రాబట్టుకుందంటే ఏ స్థాయిలో వృద్ధి సాధించిందో అర్థం చేసుకోవచ్చు. ఈ మేరకు ఫోర్బ్స్ బిజినెస్ మ్యాగజైన్ ప్రత్యేక కథనం ప్రచురించడం విశేషం. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకనామిక్ డేటా ఆధారంగా ఈ కథనం ఉంది. వాస్తవానికి ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక పెట్టుబడులకు అనువైన ప్రాంతం కాదు. ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాలు పరిశ్రమలు పెట్టేందుకు అనుకూలమైనవిగా భావిస్తారు పారిశ్రామికవేత్తలు. ఆపై పెద్ద రాష్ట్రం గా ఉత్తరప్రదేశ్ ఉంది. కానీ ఏపీ ప్రభుత్వం రాయితీలు కల్పించడం, పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ఇవ్వడంతో ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ నిరంతరం పెట్టుబడుల కోసం అన్వేషిస్తున్నారు.. విదేశాలకు వెళ్లి పారిశ్రామికవేత్తలను కలిశారు. దావోస్ ప్రపంచ పెట్టుబడుల సదస్సుకు హాజరయ్యారు. విశాఖలో ప్రభుత్వమే నేరుగా పెట్టుబడుల సదస్సు నిర్వహించింది. ఇవన్నీ సత్ఫలితాలు ఇవ్వడంతోనే ఏపీ ఈ ఘనత సాధించింది. గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు దేశవ్యాప్తంగా రూ. 26.6 లక్షల కోట్ల పెట్టుబడులకు ప్రతిపాదనలు జరిగాయి. ఇందులో 25.3% వాటాను ఏపీ దక్కించుకుంది. తరువాత స్థానంలో ఒడిస్సా 13.1% పెట్టుబడులను ఆకర్షించగలిగింది. దేశానికి ఆర్థిక రాజధానిగా ఉన్న ముంబై మహారాష్ట్ర 12.8% పెట్టుబడులను దక్కించుకుంది. దేశం మొత్తానికి వచ్చిన పెట్టుబడుల్లో సగానికి పైగా అంటే 51.2% వాటాలను ఈ మూడు రాష్ట్రాలే ఆకర్షించాయి. అందులో 25% వాటా ఏపీకే రావడం గమనార్హం. దీనిపై ఏపీ సీఎం చంద్రబాబుస్పందించారు. పెట్టుబడుల విషయంలో ఏపీ అగ్రస్థానంలో నిలవడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. మంత్రి నారా లోకేష్ సైతం హర్షం వ్యక్తం చేశారు. ఆ ఇద్దరు ప్రయత్నాలతోనే ఏపీ ఈ ఘనత సాధించిందని ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారు. వైసిపి హయాంలో పరిశ్రమలు రాలేదన్న విమర్శ ఉంది. ఉన్న పరిశ్రమలను వెళ్ళగొట్టారు అన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటువంటి తరుణంలో కూటమి చేసిన ప్రయత్నాలు సత్ఫలితాలు ఇచ్చినట్లు కనిపిస్తున్నాయి. మొత్తానికి రాజకీయంగా కూడా కూటమి ప్రభుత్వానికి ఇది గొప్ప అంశంగానే చెప్పవచ్చు.



# కాశ్మీర్ మొత్తాన్ని భారత్‌లో విలీనం చేయాలి



జైపూర్,జమ్మూకశ్మీర్ పై బ్రిటన్ ఎంపీ బాబ్ బ్లాక్‌మన్ కీలక వ్యాఖ్యలు చేశారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో సహా జమ్మూకశ్మీర్ మొత్తాన్ని భారత్‌లో విలీనం చేయాలని అన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేయాలని తాను మూడు దశాబ్దాల క్రితమే చెప్పానని, ఆ పని 1992లో కశ్మీర్ పండిట్ల వలసల కన్నా ముందే చేపట్టాల్సిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. జైపూర్‌లో సోమవారం నాడు జరిగిన హై-టీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 1990 మొదట్లో కశ్మీర్ పండిట్లు వలసలు వెళ్తున్నప్పుడే తన వైఖరిని స్పష్టం చేసినట్టు చెప్పారు. 'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 370వ అధికరణను రద్దు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టి అమలు చేయడానికి చాలాకాలం ముందే 1992లో నేను ఈ విషయం ప్రస్తావించాను. కశ్మీర్ పండిట్లకు తీవ్రం అన్యాయం జరుగుతోందంటూ యూకేలో ఒక సమావేశం కూడా నిర్వహించాం. మతం, ఇతర కారణాలతో కశ్మీర్ పండిట్లు తమ పూర్వీకుల ఇళ్లు బలవంతంగా వదిలివెళ్లాల్సి రావడాన్ని ఖండించాం' అని బ్లాక్‌మన్ తెలిపారు. జమ్మూకశ్మీర్‌లోని ప్రాంతాలను బలవంతంగా ఆక్రమించుకోవడం, పీఓకే ప్రాంతంలో పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని విస్తరించడం సరైన చర్య కాదని, ఈ విషయం తాను పదేపదే చెబుతూ వచ్చానని ఆయన అన్నారు. జమ్మూకశ్మీర్ మొత్తాన్ని భారత్‌లో విలీనం చేయాలనీ తాను అనేకసార్లు సూచించానని చెప్పారు. పహల్గాం ఉగ్రదాడిని కూడా బ్లాక్‌మన్ ఖండించారు. ఈ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోవడంపై విచారం వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు మెరుగుపడటంతో అక్కడ శాంతి నెలకొందని తాము భావించినప్పటికీ పహల్గాం దాడితో ఉగ్రసమస్య మళ్లీ వెలుగులోకి వచ్చిందన్నారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు ప్రపంచ దేశాలు బాసటగా నిలబడటం ముఖ్యమని చెప్పారు.

# కవితను ఎవరో వెనక నుంచి నడిపిస్తున్నారు



హైదరాబాద్,బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్సీ కవిత వ్యవహారం ఇప్పుడు తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. కవిత ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఘాటుగా స్పందించారు. కవిత మాటలు బీఆర్ఎస్ పార్టీకి పెను ఇబ్బందిగా మారాయని, ఆమె ఎవరో వెనుక ఉండి ఆడిస్తుంటే కీలుబొమ్మగా మారి ఇలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా కేసీఆర్ ని కంటతడి పెట్టిస్తూ, ఆయనను మానసిక క్షోభకు గురి చేస్తున్న వైనాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని సునీత స్పష్టం చేశారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యేలందరూ అసెంబ్లీని బహిష్కరిస్తే, కవిత మాత్రం భిన్నంగా వ్యవహరించడం వెనుక ఉన్న మతలబు ఏమిటని ఆమె నిలదీశారు. కవిత తన ఎమ్మెల్సీ పదవికి చేసిన రాజీనామా కేవలం ఒక నాటకమని, ఆమె మనస్ఫూర్తిగా ఆ పని చేయలేదని సునీత ఎద్దేవా చేశారు. ఒకవేళ నిజంగానే పదవి అవసరం లేదనుకుంటే కౌన్సిల్ సమావేశాలకు ఎందుకు హాజరయ్యారని ప్రశ్నించారు. అసలు పార్టీలో స్వేచ్ఛ లేకపోతే కవిత ఇన్ని పదవులు ఎలా పొందగలిగారని, ఓడిపోయి నప్పటికీ కేసీఆర్ ఆమెకు ఎమ్మెల్సీగా గౌరవప్రదమైన అవకాశం కల్పించిన విషయాన్ని మర్చిపోకూడదని హితవు పలికారు. పార్టీలో కవితకు ఉన్నంత చనువు మరెవరికీ లేదని, అలాంటిది ఇప్పుడు పార్టీని డ్యామేజ్ చేసేలా మాట్లాడటం కూర్చున్న కొమ్మను నరుక్కున్న చందంగా ఉందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సమితిని బీఆర్ఎస్ పార్టీగా మార్చడం ఇష్టం లేదంటున్న కవిత, మరి తన సొంత సంస్థ అయిన తెలంగాణ జాగృతిని 'భారత జాగృతి'గా ఎలా మార్చారని సునీత నిలదీశారు. ఇది ఆమె ద్వంద్వ వైఖరికి నిదర్శనమని, కంకణం కట్టుకుని మరీ బీఆర్ఎస్ పార్టీని ఆగం చేయాలని కవిత చూస్తున్నారని ఆరోపించారు. లిక్కర్ కేసులో కవిత ఇరుక్కున్నప్పుడు హరీష్ రావు , కేటీఆర్ వారానికి నాలుగు సార్లు ఢిల్లీకి తిరిగి ఆమె కోసం ఎంతో శ్రమించారని, కానీ ఇప్పుడు ఆమె మాత్రం పార్టీకి వెన్నుపోటు పొడిచేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు కనీస సమయం ఇవ్వని ప్రభుత్వం, కవితకు మాత్రం అంత సమయం ఎలా కేటాయించిందో చూస్తుంటే ఆమెను ఎవరు నడిపిస్తున్నారో స్పష్టంగా అర్థమవుతోందని, ఇకపై ఆమె ఆటలు సాగవని గొంగిడి సునీత హెచ్చరించారు.

# ఆ నియోజకవర్గాల్లో ఫోకస్...



విజయవాడ,వైసీపీ అధినేత వైఎస్ జగన్ త్వరలో కొన్ని జిల్లాల్లో పర్యటించాలని నిర్ణయించారని తెలిసింది. ముఖ్యంగా 2024 ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలయిన తర్వాత వైసీపీని వీడి వెళ్లిన నియోజకవర్గాల్లో ఆయన పర్యటించే అవకాశాలున్నాయి. ఇందుకోసం తేదీలు ఖరారు చేయాలని పార్టీ సీనియర్ నేతలను జగన్ ఆదేశించినట్లు తెలిసింది. ముఖ్యంగా 2024 లో ఓటమి తర్వాత కీలక నేతలు పార్టీని వీడారు. అందుకోసం తొలుత ఆ నియోజకవర్గాల్లో పర్యటించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారని తెలిసింది. ముందుగా ఎక్కడి నుంచి జగన్ తన నియోజకవర్గాల పర్యటన ప్రారంభిస్తారన్నది త్వరలోనే పార్టీ నేతలు అధికారికంగా ప్రకటించే అవకాశముందని సమాచారం. తొలిదశలో పార్టీ మారిన నియోజకవర్గాలతో పాటు రెండో విడతలో అక్రమంగా కేసులు బనాయించి జైలు శిక్ష అనుభవించి వచ్చిన వైసీపీ నేతల నియోజకవర్గాలకు జగన్ వెళ్లే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఇందుకోసం తేదీలను ఖరారు చేయాలని కోరినట్లు తెలిసింది. ముందుగా జగ్గయ్య పేట నుంచి జగన్ పర్యటన ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిసింది. జగ్గయ్య పేట నియోజకవర్గం నుంచి సామినేని ఉదయ భాను పార్టీ మారిన నేపథ్యంలో అక్కడి నుంచి ఆయన తన పర్యటన ప్రారంభిస్తారంటున్నారు. తర్వాత పొన్నూరు నియోజకవర్గానికి, ఆ తర్వాత ఒంగోలు నియోజకవర్గాన్ని పర్యటించాలని నిర్ణయించినట్లు సమాచారం. అలాగే ఏలూరు, భీమవరం నియోజకవర్గాల్లో కూడా జగన్ పర్యటించే ఛాన్స్ ఉంది. తర్వాత అక్రమంగా కేసులు ఎదుర్కొన్న నేతలకు చెందిన నియోజకవర్గాల్లో జగన్ రెండో విడత పర్యటించాలని ప్లాన్ చేస్తున్నారు. ఇందులో భాగంగా మైలవరం నియోజకవర్గంలో పర్యటిస్తారంటున్నారు. అలాగే గన్నవరం నియోజకవర్గంలోనూ సభ పెట్టాలని యోచిస్తున్నారు. దీంతో పాటు సర్వే పల్లి నియోజకవర్గానికి ఆయన వెళతారని తెలిసింది. అలాగే చంద్రగిరి నియోజకవర్గంలోనూ జగన్ పర్యటన ఉంటుందని అంటున్నారు. చివరిగా మాచర్ల నియోజకవర్గంలో పర్యటించనున్నారని తెలిసింది. జోగి రమేష్, వల్లభనేని వంశీ, కాకాణి గోవర్ధన్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వివిధ కేసుల్లో అక్రమంగా అరెస్టయిన నేపథ్యంలో ఈ నియోజకవర్గాల్లో పర్యటించాలని డిసైడ్ చేసినట్లు పార్టీ వర్గాల ద్వారా సమాచారం అందింది.

# స్మార్ట్ వ్యవసాయంతో రైతు ఆదాయం పెంపు



అమరావతి,ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగం సాంకేతికత, ఖచ్చితత్వం, స్థిరమైన అభివృద్ధి దిశగా ముందడుగు వేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళవారం విజయవాడలోని గవర్నర్ పేట నందు గల సమగ్ర జలవనరుల నిర్వహణ / రైతు శిక్షణ కేంద్రంలోని సమావేశ మందిరంలో రాష్ట్ర ఉద్యానశాఖ ఆధ్వర్యంలో సూక్ష్మ సాగునీటిలో ఆటోమేషన్ ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ నీటి వనరుల తగ్గుదల, వాతావరణ మార్పులు, సాగు వ్యయాల పెరుగుదల వంటి సవాళ్ల మధ్య రైతును కాపాడాలంటే వ్యవసాయాన్ని స్మార్ట్ వ్యవసాయంగా మార్చాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేశానికి మార్గదర్శకమైన మైక్రో ఇరిగేషన్‌ను మరింత బలోపేతం చేస్తూ, 'పర్ డ్రాప్ మోర్ క్రాప్' నుంచి 'పర్ డ్రాప్ మోర్ రిటర్న్' దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. ఇకపై నీరు, ఎరువుల వినియోగం ఊహలపై కాకుండా సెన్సర్లు, డేటా, ఆటోమేషన్ ఆధారంగా జరగడంతో 20?30 శాతం నీటి ఆదా, కార్మిక వ్యయాల తగ్గింపు, దిగుబడి,నాణ్యత పెరుగుదల సాధ్యమవుతాయని చెప్పారు. ఉద్యాన, తోట, షేడ్ నెట్, గ్రీన్ హౌస్ మరియు అధిక విలువైన పంటలకు ఈ పథకం అత్యంత ఉపయోగకరమని వివరించారు. ఖఓఐ-ూజ కింద హెక్టారుకు ?40,000 వరకు మద్దతుతో రాష్ట్రవ్యాప్తంగా అమలు జరుగుతోందని తెలిపారు. చిన్న, సన్నకారు ఎస్సీ,ఎస్టీ రైతులకు 55శాతం, ఇతర రైతులకు 45 శాతం సబ్సిడీ అందిస్తూ, ఇప్పటికే ఉన్న డ్రిప్‌లలోనూ ఆటోమేషన్ అమర్చుకునే వీలుందని చెప్పారు. ఎంపానెల్ చేసిన కంపెనీల ద్వారానే పారదర్శక అమలు, స్థిర ధరలు, అధికారి తనిఖీ అనంతరమే చెల్లింపులు, ప్రతి భాగంపై 'ఎఆర్ఎంపి' ముద్ర తప్పనిసరిగా ఉంటుందని పేర్కొన్నారు. వారంటీ, సర్వీస్ సపోర్ట్, త్వరితగతిన ఫిర్యాదు పరిష్కారం కల్పిస్తూ రైతును ఎప్పుడూ భరోసాగా నిలబెడతామని స్పష్టం చేశారు. నీటి, విద్యుత్, ఎరువుల ఖర్చులు తగ్గి, దిగుబడులు పెరిగి, రైతు ఆదాయం స్థిరపడేలా ఆటోమేషన్ ఆధారిత మైక్రో ఇరిగేషన్ వ్యవసాయ సంస్కరణగా నిలుస్తుంది. స్మార్ట్ వ్యవసాయంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశానికి ఆదర్శంగా నిలబెడదామని మంత్రి అచ్చెన్నాయుడు గారు అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, ఉద్యాన శాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యాశాఖ ఉన్నతాధికారుల తీరుపై సీరియస్




అమరావతి,విద్యాశాఖలోని ఉన్నతాధికారుల వ్యవహారశైలిపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సీరియస్ అయింది. కోర్టు ఉత్తర్వులంటే విద్యాశాఖ అధికారులకు కనీస మర్యాద లేకుండా పోయిందంటూ కాస్తా ఘాటుగా వ్యాఖ్యానించింది. పవర్ ఫుల్ వ్యక్తుల కింద పనిచేస్తునందున ఎవరు ఏమి చేయలేరనే భావనతో ఉన్నట్లు ఉన్నారని ఉన్నతాధికారుల తీరుపై హైకోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుత ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు.. కోర్టుతో ఘర్షణ పడాలని ఆశిస్తున్నారా? అంటూ నిలదీసింది. ఆలోచన అదే అయితే.. ఎలా డీల్ చేయాలో తమకు తెలుసునంటూ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో తదుపరి విచారణ నాటికి కోర్టుకు హాజరు కావాలంటూ ఐఏఎస్ అధికారి బి.శ్రీనివాసరావును ఆదేశించింది. సదరు ఐఏఎస్ అధికారికి సోమవారం హైకోర్టు నోటీసులు జారీ చేసింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై ఏపీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్‌పై కోర్టు ధిక్కరణ కేసును సుమోటోగా తీసుకుంది. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పార్ట్ టైమ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లుగా పనిచేస్తున్న తమను అర్థాంతరంగా తొలగించడాన్ని సవాల్ చేస్తూ బాధితులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వారిని కొనసాగించాలని సింగిల్ జడ్జ్ ఇచ్చిన ఆదేశాలను 2024 జనవరిలో ధర్మాసనం ముందు అధికారులు అప్పీల్ చేశారు. ఈ ఉత్తర్వులను అమలు చేస్తామని గత విచారణ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని కోర్టుకు పిటిషనర్ల తరఫు న్యాయవాది గుర్తు చేశారు. దాంతో హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇక విజయనగరం అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ చేసిన తప్పునకు స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్‌ను బాధ్యుడిగా చేయడం సరికాదని ప్రభుత్వం తరఫు న్యాయవాది రామచంద్రరావు కోర్టులో తన వాదనలు వినిపించారు. ఉన్నతాధికారి ఆదేశాలు ఇవ్వడమే కాదు... వాటిని అమలు చేయాల్సిన అవసరం కూడా ఉందని ఈ సందర్భంగా హైకోర్టు వ్యాఖ్యానించింది. అనంతరం ఈ కేసు విచారణను నెల రోజులకు ఏపీ హైకోర్టు వాయిదా వేసింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com